మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 21-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 142 Issue: 142

21 నవంబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:28 సూర్యాస్తమయం - సా. 5:35 తిథి పాడ్యమి మ. 2:46 వరకు తరువాత విదియ సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం అనురాధ మ. 1:48 వరకు తరువాత జ్యేష్ఠ యోగం అతిగండ ఉ. 10:40 వరకు కరణం బవ మ. 2:46 వరకు భాలవ తె. 3:59ం వరకు వర్జ్యం రా. 8:11 నుండి రా. 9:58 వరకు దుర్ముహూర్తం ఉ. 8:41 నుండి ఉ. 9:26 వరకు మ. 12:24 నుండి మ. 1:08 వరకు రాహుకాలం ఉ. 10:38 నుండి మ. 12:01 వరకు యమగండం మ. 2:48 నుండి సా. 4:12 వరకు గుళికాకాలం ఉ. 7:51 నుండి ఉ. 9:15 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:52 నుండి తె. 5:40 వరకు అమృత ఘడియలు లేదుజి అభిజిత్ ముహూర్తం ఉ. 11:39 నుండి మ. 12:24 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# అన్నింటికీ ఆధార్




## సినిమా హాల్‌కు వెళ్లాలన్నా..

**రెస్టారెంట్‌లో తినాలన్నా సరే.. త్వరలో కేంద్రం కొత్త రూల్స్!**


**ఆఫ్‌లైన్ ధ్రువీకరణ కోసం కొత్త వ్యవస్థ.. త్వరలో అందుబాటులోకి..**

ప్రతి పనికి ఆధార్ కార్డు తప్పనిసరి అవుతోంది. ఆధార్ కార్డు వెంట లేకుండా.. ఏ పని జరగడం లేదు. అయితే, రాబోయే రోజుల్లో ఆధార్ ఉపయోగం మరింత పెరగనుందని సమాచారం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిబంధనల్లో కీలక మార్పులు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇకపై హెూటల్, రెస్టరెంట్, అపార్ట్‌మెంట్.. ఇలా ఎక్కడికి వెళ్లినా ఆధార్ తప్పనిసరి అయ్యే అవకాశం ఉంది.


# ధరల్లో గోల్‌మాల్ లేదు!

## ప్రకటించిన 26 ఈ- కామర్స్ సంస్థలు

దేశంలోని 26 ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్స్‌లో డార్క్ ప్యాటర్న్స్ లేవని స్వయంగా ప్రకటించాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జెప్టో, జొమాటో, స్విగ్గీ, జియోమార్ట్, బిగ్‌బాస్కెట్ వంటి ప్లాట్‌ఫామ్స్ ఇందులో ఉన్నాయని తెలిపింది. డిజిటల్ మార్కెట్‌లో వినియోగదారుల హక్కుల రక్షణలో ఇదో కీలక ముందడుగుగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అభివర్ణించింది. 'డార్క్ ప్యాటర్న్స్ ప్రివెన్షన్ అండ్ రెగ్యులేషన్' మార్గదర్శకాలు-2023కు అనుగుణంగా తమ ప్లాట్‌ఫామ్‌లు ఉన్నట్లు ఈ సంస్థలు స్వీయ ప్రకటనలు సమర్పించాయి.




డార్క్ ప్యాటర్న్ అంటే.. -లోపలి పేజీల్లో



# అడుగు దూరంలో మన మణిక!

మిస్ యూనివర్స్ 2025 గ్రాండ్ ఫినాలేకి కౌంట్ డౌన్ మొదలైంది. మిస్ యూనివర్స్ పోటీలు థాయిలాండ్‌లోని నొంతబూరిలో జరుగుతున్నాయి. గ్రాండ్ ఫినాలే ఈవెంట్ అట్టహాసంగా జరగనున్నాయి. శుక్రవారం గ్రాండ్ ఫినాలే జరగనుంది. భారత ప్రకారం ఉదయం 6.30 గంటలకు గ్రాండ్ ఫినాలే కార్యక్రమం ప్రారంభం అవుతుంది.

న్యూఢిల్లీ: ఈ పోటీల్లో 74వ మిస్ యూనివర్స్ కిరీటం దక్కించుకొనేది ఎవరన్నది తేలిపోనుంది. ఈ పోటీల్లో 130 దేశాలకు చెందిన గ్లామర్ మోడల్స్ కంటెస్టెంట్స్‌గా పాల్గొనగా, ఇండియా తరపున రాజస్థాన్ కి చెందిన మణిక విశ్వకర్మ ఫైనల్స్‌కి చేరింది. ఈ ఏడాది మణిక విశ్వకర్మ మిస్ యూనివర్స్ ఇండియా 2025 టైటిల్ గెలుచుకుంది. ఇప్పుడు ఆమె మిస్ యూనివర్స్ 2025 ఫైనల్స్‌లోకి అడుగుపెట్టింది. మిస్ యూనివర్స్ టైటిల్ ఆమె గెలిస్తే.. ఆ ఘనత సాధించిన నాల్గవ భారతీయ మహిళగా చరిత్ర సృష్టిస్తుంది. గతంలో సుష్మితా సేన్, లారా దత్తా, హర్నాజ్ సంధు ఈ ఘనత సాధించినవారిలో ఉన్నారు.

# మూడు దశల్లో... పల్లె పోరు!

వచ్చే నెల 11, 14, 17 తేదీల్లో స్థానిక ఎన్నికలు!




## ఈ నెల 26 లేదా 27వ తేదీన మోగనున్న నగారా

**జిల్లా కలెక్టర్లతో ఎస్ఈసీ రాణి కుముదిని వీసీ.. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం వేగం పెంచింది. ఇప్పటికే ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ విడుదల చేయగా, ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని గురువారం సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై కీలక సూచనలు చేశారు.

హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలను మూడు విడతలలో నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్థంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందిస్తామని వెల్లడించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని అన్నారు. 2011 ఎన్నికల జాబితా ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, -2 వ పేజీలో...



# హిడ్మా

## అంత్యక్రియలు పూర్తి

**భారీగా హాజరైన ఆదివాసీలు**

సుక్మా(ఛత్తీస్‌గఢ్): ఏపీలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎన్‌కౌంటర్‌లో హతమైన మావోయిస్టు అగ్రనేత హిడ్మాకు స్వగ్రామం ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లా పూవర్తిలో అంత్యక్రియలు జరిగాయి. ఏపీలోని రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం హిడ్మా మృతదేహం స్వగ్రామమైన ఛత్తీస్‌గఢ్‌లోని పువర్తికి చేరుకుంది. హిడ్మా మృతదేహం రాకతో పరిసర గ్రామాల్లోని ఆదివాసీలు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్): | రూ.12,446 |
| వెండి (గ్రాము): | రూ.173 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,441 |

# కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్

## ఫార్ములా-ఈ కేసులో విచారణకు గవర్నర్ అనుమతి

**మాజీమంత్రిపై చార్జ్‌షీట్ దాఖలు చేయనున్న ఏసీబీ**



హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): ఫార్ములా ఈ-కారు రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇచ్చారు. దీంతో, ఈ-కారు రేసు కేసులో కేటీఆర్‌పై ఛార్జ్‌షీట్ వేసేందుకు ఏసీబీకి గవర్నర్ అనుమతి లభించినట్టు అయ్యింది. త్వరలోనే కేటీఆర్‌పై అభియోగాలు నమోదు చేసేందుకు ఏసీబీ సిద్ధం కానుంది. విచారణ తర్వాతే చార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశం ఉంది. ఏ2గా ఉన్న ఐఏఎస్ అరవింద్ కుమార్‌పై డీవోపీటీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కేంద్రం అనుమతి ఇస్తే ఆయనపైనా ఏసీబీ అభియోగాలు నమోదు చేయనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి -2 వ పేజీలో...



# రాబర్ట్ వాద్రాపై ఈడీ చార్జిషీట్

## డిసెంబర్ 6న ఢిల్లీ కోర్టు విచారణ

కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాపై మనీలాండరింగ్ కేసులో ఈడీ రాబర్ట్ చార్జిషీట్ దాఖలు చేసింది. యూకేకి చెందిన ఆయుధాల డీలర్ సంజయ్ భండారీకి సంబంధించిన కేసులో రాబర్ట్ వాద్రాపై చార్జిషీట్ నమోదైంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద చార్జిషీట్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టుకు సమర్పించింది.

న్యూఢిల్లీ: దీనిపై ఢిల్లీ కోర్టు డిసెంబర్ 6న విచారణ చేపట్టనుంది. ఇదే కేసులో ఈ ఏడాది జూలైలో రాబర్ట్ వాద్రాను ఈడీ ఐదు గంటలపాటు ప్రశ్నించింది. ఈ సందర్భంగా ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. తాజాగా ఈ కేసులో ఈడీ చార్జిషీట్ , -2 వ పేజీలో...




# సన్నబియ్యం దేశమంతా ఇవ్వాలి

## కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీకి రేవంత్ సూచన

దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల ద్వారా విని యోగ దారులకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నా మని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలం గాణ మాదిరిగా దేశవ్యాప్తంగా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): గురువారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి హైదరాబాద్ వచ్చారు. ఆయనతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీపై ప్రహ్లాద్ జోషికి సీఎం వివరించారు. ప్రజలు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



పళ్లపై ఎనామిల్ పొర లేకపోతే పాడైపోతాయి. ఆ పొర మళ్లీ పుట్టదు. అయితే, తాజాగా శాస్త్రవేత్తలు ఎనామిల్ పొరను పుట్టించే జెల్‌ను అభివృద్ధి చేశారు. ఉమ్ము నుంచి సేకరించి ప్రొటీన్లను జెల్‌ను తయారుచేసినట్లు యూనివర్సిటీ ఆఫ్ నాటింగ్‌హామ్ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# రాష్ట్రపతే సుప్రీం

## బిల్లులపై గడువు విధించలేం

**గవర్నర్లనూ మేం ఆదేశించలేం.. అది రాజ్యాంగానికే విరుద్ధం**

**న్యాయసమీక్ష మాత్రం చేస్తాం.. సుప్రీంకోర్టు కీలక తీర్పు**



న్యూఢిల్లీ: రాష్ట్రపతి, గవర్నర్లకు పెండింగ్ బిల్లుల విషయంలో న్యాయస్థానాలు గడువులు విధించలేవని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మూడు నెలల గడువు విధిస్తూ గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కోర్టును రిఫరెన్స్ కోరిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం అలాంటి గడువులు ఉండబోవని.. అయితే అకారణంగా బిల్లుల్ని పెండింగ్‌లో పెడితే -2 వ పేజీలో...

# పోలీస్ శాఖకు 600 కోట్లు

## మంజూరు చేసిన రేవంత్ సర్కార్

**ఆంబిస్ అప్‌గ్రేడేషన్ కోసం నిధులు**



హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): తెలంగాణ పోలీస్ శాఖ నేర పరిశోధన సామర్థ్యాన్ని, వేగాన్ని విప్లవాత్మకంగా పెంచేందుకు ఆటోమేటెడ్ మల్టీ మోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఆంబిస్)ను అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లు మంజూరు చేసింది. పాతబడిన తరువాయి 2 వ పేజీలో...



# పదోసారి సీఎంగా నితీశ్ ప్రమాణం

పాట్నా: బీహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం కొలువు దీరింది. జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. పాట్నాలోని గాంధీ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎంగా నితీశ్ కుమార్ పదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం నితీశ్ కుమార్, డిప్యూటీ సీఎంలు సామ్రాట్ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

21.11.2025

మేషం: పితృ వర్గీయులతో వివాదాలు కొంత చికాకు పరుస్తాయి. చేపట్టిన పనులలో ప్రతిష్టంభన కలుగుతాయి. రెండు రకములైన ఆలోచన వల్ల నష్టాలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. బంధువులతో అకారణ వివాదాలు తప్పవు. కొన్ని వ్యవహారాలు దైవానుగ్రహంతో పూర్తి చేస్తారు.

వృషభం: ఇతరుల పై మీ ఆలోచనా విధానం మార్చుకోవడం మంచిది. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. పనుల్లో ప్రతిబంధకాలు ఉంటాయి. ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. జీవిత భాగస్వామితో ఊహించని వివాదాలు కలుగుతాయి. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా వేస్తారు.

మిథునం: వ్యాపారాల్లో ఆశించిన విధంగా రాణిస్తాయి. నూతన విషయాలపై దృష్టి సారిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఉద్యోగంలో అధికారులతో చర్చలు ఫలిస్తాయి. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. ఇంటా బయట అందరితో సఖ్యతగా వ్యవహరిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు. ఒక వ్యవహారంలో సన్నిహితులు సహాయ సహకారాలు అందుతాయి. చేపట్టిన పనులలో యత్న కార్యసిద్ధి కలుగుతుంది.

సింహం: చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆర్థికంగా మరింత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. సంతానానికి నూతన విద్యా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

కన్య: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. బంధుమిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. బంధుమిత్రులు మీ మాటతో విబేదిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు మందగిస్తాయి. నూతన ప్రయత్నాలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు.

తుల: స్థిరస్తి కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. కొన్ని విషయాలలో ఆత్మీయుల సహాయ సహకారాలు అందుతాయి. సమాజంలో గౌరవ మర్యాదలు లోటు ఉండదు.

వృశ్చికం: వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి అధికమవుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. నిరుద్యోగులకు ఒక వార్త సంతోషాన్నిస్తుంది. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి.

ధనస్సు: బంధువులతో వివాదాలు పరిష్కారమవుతాయి. చిన్ననాటి మిత్రుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతారు. వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

మకరం: దూరప్రయాణ సూచనలున్నవి. స్వల్ప ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బంది కలిగిస్తుంది. నూతన ఋణప్రయత్నాలు కలసిరావు. చేపట్టిన పనులలో శ్రమపడ్డా ఫలితం కనిపించదు.

కుంభం: వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. ముఖ్యమైన పనులు సమయానికి పూర్తిచేస్తారు. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభిస్తారు. అందరిలోనూ గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి.

మీనం: వృత్తి ఉద్యోగాలలో అధికారులు అనుగ్రహంతో పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. నూతన వ్యాపారాలు పెట్టుబడులు అందుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాల్లో పాల్గొంటారు. మొండి బకాయిలు వసూలవుతాయి.

# అన్నింటికీ ఆధార్

**సినిమా హాల్‌కు వెళ్లాలన్నా..**

**త్వరలో కేంద్రం కొత్త రూల్స్!**

**ఆఫ్‌లైన్ ధ్రువీకరణ కోసం కొత్త వ్యవస్థ**


**త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం**

న్యూఢిల్లీ: ఆఫ్‌లైన్ వెరిఫికేషన్‌కు సంబంధించి కొత్త యాప్‌ను తీసుకురాబోతున్నట్లు ఇటీవల భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం హొటళ్లు తదితర ప్రదేశాలకు వెళ్తే.. ఆధార్ ధ్రువీకరణ అడుగుతున్నారు. అలాంటి చోట్ల ఒరిజినల్ ఆధార్‌తో పాటు జిరాక్స్ ఇస్తే.. ఆధార్ సమాచారం దుర్వినియోగం అవుతోంది. దీన్ని అరికట్టడానికే ఉడాయ్ ఈ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఆధార్ కార్డుపై వివరాలేమీ లేకుండా.. కేవలం క్యూఆర్ కోడ్, ఫొటో మాత్రమే ఉండేలా మార్పులు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఉడాయ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త ఆఫ్‌లైన్ ధ్రువీకరణ సిస్టమ్ పూర్తిగా క్యూర్ కోడ్ ఆధారంగా పనిచేస్తుంది. ప్రూఫ్ ఆఫ్ ప్రజెన్స్ అనే సరికొత్త టెక్నాలజీని ఇందులో ఉపయోగిస్తారు. ఉడాయ్ సర్వర్లకు అనుసంధానం కాకుండానే.. ముఖాన్ని స్కాన్ చేసి వ్యక్తిని ధ్రువీకరిస్తారు. ఈ వ్యవస్థ ప్రస్తుతం బ్యాంకులు ఉపయోగిస్తున్న ఫేస్ అథెంటికేషన్ కంటే భిన్నంగా ఉంటుంది. ఇది అమల్లోకి వస్తే.. హొటళ్లు, లాడ్జ్‌లు, ఆఫీసులు, సినిమా హాళ్లు, కన్సర్ట్‌లు, రెస్టారెంట్లు, స్టేడియాలు, గేటెడ్ కమ్యూనిటీలు, డేటా సెంటర్లు, ఆసుపత్రులు, పరీక్షల్లో విద్యార్థులు.. ఇలా అనేక చోట్ల ఆధార్ యాక్సెస్‌తో మనిషిని ధ్రువీకరించేందుకు అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన రూల్స్‌ను త్వరలోనే ఉడాయ్ విడుదల చేయనుంది. ఇలా వ్యక్తుల ధ్రువీకరణ చేయడానికి ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అంటే చట్టపరంగా రిజిస్టర్ అయిన సినిమా హాళ్లు, ఆసుపత్రులు, స్టేడియాలు, ఆఫీసులు.. వంటివి ఏవైనా 'ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ సీకింగ్ ఎంటీటీ'గా మారేందుకు అప్లై చేసుకోవచ్చు. ఈ ఆన్‌బోర్డింగ్ ప్రక్రియలో డాక్యుమెంట్ల ధ్రువీకరణ, టెక్నాలజీ ఇంటిగ్రేషన్, క్యూఆర్ కోడ్‌ల జనరేషన్ వంటి ప్రక్రియలు ఉంటాయి. ఇందుకు నామమాత్రపు ఫీజు వసూలు చేస్తారు. త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చే ఈ యాప్ టెస్టింగ్ చివరి దశలో ఉన్నట్లు సమాచారం.

## ధరల్లో గోల్‌మాల్ లేదు!

**ప్రకటించిన 26 ఈ- కామర్స్ సంస్థలు**

న్యూఢిల్లీ: దేశంలోని 26 ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్స్‌లో డార్క్ ప్యాటర్న్స్ లేవని స్వయంగా ప్రకటించాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జెప్టో, జొమాటో, స్విగ్గీ, జియోమార్ట్, బిగ్‌బాస్కెట్ వంటి ప్లాట్‌ఫామ్స్ ఇందులో ఉన్నాయని తెలిపింది. డిజిటల్ మార్కెట్‌లో వినియోగదారుల హక్కుల రక్షణలో ఇదో కీలక ముందడుగుగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అభివర్ణించింది. 'డార్క్ ప్యాటర్న్స్ ప్రివెన్షన్ అండ్ రెగ్యులేషన్' మార్గదర్శకాలు-2023కు అనుగుణంగా తమ ప్లాట్‌ఫామ్‌లు ఉన్నట్లు ఈ సంస్థలు స్వీయ ప్రకటనలు సమర్పించాయి. వినియోగదారులను తప్పు దారి పట్టించే, మోసపూరిత ఆన్‌లైన్ డిజైన్ పద్ధతులను అరికట్టేందుకు ప్రభు త్వం చర్యలు చేపట్టింది. దీంతో సం బంధిత సంస్థలు అంతర్గతంగా లేదా థర్డ్ పార్టీలతో ఆడిట్ నిర్వహించి డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించి తొలగించాయి. డార్క్‌ప్యాటర్న్స్ ఏవీ తమ ప్లాట్‌ఫారాల్లో లేవని ఈ 26 సంస్థలు ప్రకటించాయని సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ తెలిపింది. ఫాల్స్ అర్జెన్సీ, బాస్కెట్ స్నీకింగ్, కన్‌ఫర్మ్ షేమింగ్, ఫోర్స్డ్ యాక్షన్, సబ్‌స్క్రిప్షన్ ట్రాప్, ఇంటర్‌ఫేస్ ఇంటర్‌ఫియరెన్స్, బైట్ అండ్ స్విచ్, డ్రిప్ ప్రైసింగ్, డిస్‌గైజ్డ్ అడ్వర్టైజ్‌మెంట్స్, నాగింగ్, ట్రిక్ వర్డింగ్, సాస్ బిల్లింగ్, రోగ్ మాల్వేర్స్ వంటివి డార్క్‌ప్యాటర్న్స్‌గా పేర్కొంటారు.




## డార్క్ ప్యాటర్న్ అంటే..

మీరు మీ కార్ట్‌కి ఒక వస్తువును జోడించి ఆపై చెల్లించడానికి వెళ్ళినప్పుడు ధర అకస్మాత్తుగా పెరుగుతుందని గమనించే ఉంటారు. ఈ ఆకస్మిక పెరుగుదల ఎందుకు జరుగుతుందో మీరు ఎప్పుడైనా ఆలోచించారా? ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో అసలు ధరను దాచడానికి తరచుగా వివిధ ట్రిక్స్ ఉపయోగిస్తారు. వినియోగదారులు తరచుగా ఒక ఉత్పత్తి ధర తగ్గిన వెంటనే వారి కార్ట్‌కు జోడిస్తారు. కానీ వారు చివరికి చెల్లించడానికి వెళ్ళినప్పుడు మొత్తం ధర అకస్మాత్తుగా పెరుగుతుంది. దీనిని డార్క్ ప్యాటర్న్‌లు అంటారు. ప్రభుత్వ సంస్థలు ఈ సమస్యకు సంబంధించి హెచ్చరికలు జారీ చేశాయి. హెల్ప్‌లైన్ నంబర్‌లకు కాల్ చేయాలని సూచించాయి. వినియోగదారుల వ్యవహారాలు పంచుకున్న సమాచారం ఈ పోస్ట్‌ను ఎక్స్ ప్లాట్‌ఫారమ్‌లోని కన్స్యూమర్ అఫైర్స్ అనే ఖాతా ద్వారా చేయబడింది. ముదురు రంగు నమూనాలు సరైన ఉత్పత్తిని ఎంచుకోకుండా మిమ్మల్ని నిరోధిస్తున్నాయని వారు పేర్కొన్నారు. మీరు ఏవైనా ముదురు రంగు నమూనాలను గమనించినట్లయితే, దయచేసి వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి. పండుగ అమ్మకాల సమయంలో చాలా కేసులు వస్తాయి. మీరు తరచుగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో రూ.37,999కి స్మార్ట్‌ఫోన్‌ను జాబితా చేసే సేల్ బ్యానర్‌లను చూసి ఉంటారు. కానీ మీరు దానిపై క్లిక్ చేసినప్పుడు అసలు ధర ఎక్కువగా ఉంటుంది. ఈ-కామర్స్ కంపెనీలు తరచుగా ఉత్పత్తి కింద వాస్తవ ధరను ప్రదర్శించడానికి చిన్న ఫాంట్ పరిమాణాన్ని ఉపయోగిస్తాయి. ఇందులో బ్యాంక్ ఆఫర్‌లతో సహా అన్ని ఆఫర్‌లు ఉంటాయి. అనేక రకాల డార్క్ ప్యాటర్న్‌లు ఉన్నాయి. అవన్నీ భిన్నంగా పనిచేస్తాయి. డార్క్ ప్యాటర్న్‌లలో తరచుగా టైమర్‌లు, దాచిన ఖర్చులు, బలవంతపు కొనసాగింపు ఉంటాయి. వాటిని గుర్తించడం సులభం. ఎవరైనా టైమర్‌ను సెట్ చేసి త్వరిత చెల్లింపు కోసం అడిగితే ఇది ఒక రకమైన డార్క్ ప్యాటర్న్. కొన్నిసార్లు, దశలు మారినప్పుడు పరిస్థితులు మారుతాయి. డార్క్ ప్యాటర్న్‌లను నివారించడానికి ఎప్పుడూ తొందరపడి చెల్లింపులు చేయకపోవడం ముఖ్యం. అన్ని షరతులు, దశలను జాగ్రత్తగా చదవండి. వాటిని స్పష్టంగా అర్థం చేసుకున్న తర్వాత మాత్రమే కొనసాగండి. ఉచిత ట్రయల్ తర్వాత ఆటో చెల్లింపులను నిలిపివేయండి.

## సన్నబియ్యం దేశమంతా ఇవ్వాలి

**మొదటి పేజీ తరువాయి**

తినే బియ్యం సరఫరా చేసినప్పుడే ఆ సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్నట్టుగా దేశవ్యాప్తంగా వినియోగదారులకు సన్నబియ్యం పంపిణీ చేసే అంశాన్ని కేంద్రం పరిశీలించా లని సూచించారు. ఈ విషయంలో అవసరమైతే సమగ్రంగా అధ్యయనం చేసి తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్ సూచనపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. పూర్తి స్థాయి అధ్యయనం చేసి సన్నబియ్యం పంపిణీపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సీఎస్ రామకృష్ణారావుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హిడ్మా అంత్యక్రియలు పూర్తి

**మొదటి పేజీ తరువాయి**

ఆయనను కడసారి చూసేందుకు భారీగా తరలివచ్చారు. హిడ్మా మృతదేహాన్ని చూసిన తల్లి మాంజు, ఇతర బంధువులు.. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఆదివాసీల రోదనలతో ఆ ప్రాంతం శోక సంద్రంగా కనిపించింది. భద్రతా బలగాలు భారీ ఎత్తున గ్రామంలో మోహరించాయి. అయినప్పటికీ బెదరకుండా హిడ్మాను చూసేందుకు ఆదివాసీలు భారీగా తరలివచ్చారు. పువర్తిలో 50 ఇళ్లు మాత్రమే ఉండగా..ఇక్కడి నుంచి ఏకంగా 90 మంది యువ కులను హిడ్మా మావోయిస్టులుగా మార్చడం విశేషం. హిడ్మా ఎన్‌కౌంటర్ అనంతరం గ్రామంలోని 50 ఇళ్లలో సగానికిపైగా ఇళ్లకు తాళాలు వేసి కనిపించాయి.

## కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్

**మొదటి పేజీ తరువాయి**

మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ ఇప్పటికే పలుమార్లు ఏసీబీ విచారణకు హాజరయ్యారు. రెండు సార్లు ఏసీబీ విచారణకు, ఒకసారి ఈడీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబర్ 18న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అర్విందకుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిపై కేసు నమోదైంది.

## రాష్ట్రపతే సుప్రీం

**మొదటి పేజీ తరువాయి**

మాత్రం కోర్టులు జోక్యం చేసుకోక తప్పదని వ్యాఖ్యానించింది. 'రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లులపై కోర్టులు గడువు నిర్దేశించలేవు. గవర్నర్ బిల్లును ఆమోదించేందుకు రాజ్యాంగంలో ఏ సమయ పరిమితి (డెడ్‌లైన్) లేదు. అయితే.. గవర్నర్లు బిల్లులను సుదీర్ఘకాలం ఆమోదించకుంటే మాత్రం న్యాయ సమీక్ష అధికారం కోర్టులకు ఉంటుంది. మేము గవర్నర్‌కు పరిమితమైన సూచనలు మాత్రమే ఇవ్వగలం. గవర్నర్ ముందు మూడే మార్గాలు ఉన్నాయి. ఆమోదించడం.. రాష్ట్రపతికి పంపడం.. ఆమోదించకుండా అసెంబ్లీకి తిరిగి పంపడం. ఈ మూడు మార్గాలను ఎంపిక చేయడంలో మాత్రమే గవర్నర్‌కు విచక్షణ ఉంది. పునఃపరిశీలనకు పంపకపోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. నాలుగో అధికారం గవర్నర్లకు ఉండదు. నిరవధిక ఆలస్యం జరిగితే న్యాయ సమీక్ష పరిధిలోకి వస్తుంది' అని చీఫ్ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. అసెంబ్లీ బిల్లులను పలు రాష్ట్రాల గవర్నర్లు పెండింగ్‌లో పెడుతుండడం సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తమిళనాడు ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. మూడు నెలల గడువు విధిస్తూ ఆలోపు ఆమోదించాల్సిందేనని. లేకుంటే ఆమోదించినట్లేనని పేర్కొంది. గవర్నర్ విషయంలోనే కాదు.. రాష్ట్రపతి విషయంలోనూ ఇది వర్తిస్తుందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ తీర్పులో జస్టిస్ బీఆర్ గవాయ్ కూడా భాగం అయ్యారు. అయితే.. గడువుపై పిటిషన్లను సుప్రీం కోర్టు అనుమతించలేదు. దీంతో ఈ తీర్పుపై స్వయంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రిఫరెన్స్ కోరారు. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద అధికారాలపై ఆరా తీసిన ఆమె.. సర్వోన్నత న్యాయస్థానానికి 14 ప్రశ్నలు సంధించారు. రాజ్యాంగం కల్పించిన అధికారాలను కాదనొచ్చా? అని ప్రశ్నించారు. రాష్ట్రపతి రిఫరెన్స్‌పై చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం వాదనలు విన్నది. ఈ బెంచ్‌లో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ఏఎస్ చందుర్కర్ ఉన్నారు.

# పోలీస్ శాఖకు 600 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

సర్వర్లు, స్టోరేజ్ పరికరాల స్థానంలో, ప్రస్తుతం ఉన్న ఆంబిస్‌కు మరింత శక్తివంతమైన, అత్యాధునిక హార్డ్‌వేర్‌ను అమర్చనున్నారు. ఈ కొత్త వ్యవస్థలో 64 సీపీయూ కోర్లు, 1 టీబీ ర్యామ్, 100 ప్లస్ టీబీకిపైగా స్టోరేజ్ సామర్థ్యం ఉండనుంది. ఈ సాంకేతిక అప్‌గ్రేడ్‌తో డేటా ప్రాసెసింగ్ వేగం అసాధారణంగా పెరుగుతుంది. తద్వారా వేల నేరాల రికార్డులను, బయోమెట్రిక్ వివరాలను సెకన్లలోనే విశ్లేషించేందుకు వీలు కలుగుతుంది. ఈ నూతన ఆంబిస్ వ్యవస్థ అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే.. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్న బయోమెట్రిక్ పరికరాలను ఈ సెంట్రల్ హార్డ్‌వేర్‌తో లింక్ చేస్తారు. దీని ద్వారా, ఏ పోలీస్ స్టేషన్లోనైనా సేకరించిన వేలిముద్రలు, అరచేతి ముద్రలు లేదా ఇతర బయోమెట్రిక్ డేటా నేరుగా కేంద్రీకృత డేటాబేస్‌లోకి వెళ్లిపోతుంది. ఈ కేంద్ర వ్యవస్థ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించుకొని నేరస్థుల రికార్డులతో చెక్ చేస్తుంది. ఈ ప్రక్రియ కొన్ని సెకన్లలోనే పూర్తవుతుంది. గతంలో రోజుల తరబడి లేదా వారాల తరబడి పట్టే ఈ మ్యాచింగ్ ప్రక్రియ, ఇప్పుడు తక్షణమే పూర్తయ్యి, నేర పరిశోధన వేగం అనూహ్యంగా పెరుగుతుంది. ఉదాహరణకు, ఒక నేర స్థలంలో దొరికిన అస్పష్టమైన వేలిముద్ర లేదా అరచేతి ముద్రను స్కాన్ చేసి, ఏఐ ఆధారిత ఆంబిస్‌లోకి పంపినప్పుడు, ఆ వ్యవస్థ సెకన్ల వ్యవధిలో నేరస్థుడి గుర్తింపును తెలియజేస్తుంది. దర్యాప్తు అధికారులకు త్వరితగతిన లీడ్‌ను అందించి, నేరాన్ని ఛేదించడంలో సహాయపడుతుంది. రాష్ట్రంలోని సుదూర ప్రాంతాలలో ఉన్న పోలీస్ స్టేషన్లు కూడా ఈ సాంకేతిక ప్రయోజనాన్ని పొందుతాయి.



## రాబర్ట్ వాద్రాపై ఈడీ చార్జిషీట్

**మొదటి పేజీ తరువాయి**

దాఖలు చేసింది. గతంలో గుర్గావ్‌లోని సెక్టార్ 83లో షికోహ్‌పూర్‌లో 3.53 ఎకరాల భూమి కొనుగోలు వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందంటూ రాబర్ట్ వాద్రాపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేయడం గమనార్హం. అప్పట్లో తనపై కేసులు రాజకీయ ప్రేరేపితం అని వాద్రా ఆరోపించారు. తాను గాంధీ కుటుంబంలో భాగం కావడం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారన్నారు. తాను బీజేపీలో చేరి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని విమర్శించారు.

## మూడు దశల్లో... పల్లె పోరు!

**మొదటి పేజీ తరువాయి**

2024 ఎస్ఈ ఈఈపీసీ సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కేటాయించనున్నట్లు చెప్పారు.

**3 దశల్లో ఎన్నికల నిర్వహణ**

మొత్తం మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల కసరత్తు చేస్తోంది. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ నెల 26 లేదా 27న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 1 నుంచి 9 వ తేదీ వరకు ప్రజా పాలన వారోత్సవాలు జరుగుతాయి. ఆ తర్వాత ఈ ఎన్నికల నిర్వహించాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా, ఎన్నికల నిర్వహణపై ఈసీ ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటికే.. గురువారం నుంచి ఈ నెల 23 వరకు ఓటర్ల జాబితాను సవరిస్తున్నారు. 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాలను పరిష్కరిస్తారు. 23న ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుంది.

## పదోసారి సీఎంగా నితీశ్ ప్రమాణం

**మొదటి పేజీ తరువాయి**

చౌదరి, విజయ్ కుమార్ సిన్హాతో మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం, మంత్రులతో గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఏపీ, ఢిల్లీ సీఎంలు చంద్రబాబు, రేఖాగుప్తాతో పాటు ఎన్డీయేకు చెందిన పలువురు సీనియర్ నేతలు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల మంత్రులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రధాని మోదీ సభా వేదికపై నితీశ్ చేయి పట్టుకొని అభివాదం చేశారు. ప్రజలకు ప్రణామం చేస్తూ.. చేతిలో కండువాను ఎగురవేస్తూ హల్‌చల్ చేశారు.

### విద్య, ఉద్యోగవాణి

## ఐబీపీఎస్ క్లర్క్ ఫలితాలు విడుదల

ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) క్లర్క్ (కస్టమర్ సర్వీస్ అసోసియేట్ - సీఎస్ఏ) ప్రిలిమ్స్ పరీక్ష ఫలితాలను తాజాగా ప్రకటించింది. అభ్యర్థులు తమ ఫలితాన్ని అధికారిక వెబ్‌సైట్ ఐఎజూం.ఐఆ ద్వారా చెక్ చేసుకోవచ్చు. ఫలితాలను చెక్ చేసుకోవడానికి అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేయాలి. ఈ సంవత్సరం, ప్రభుత్వ రంగ బ్యాంకులలో కస్టమర్ సర్వీస్ అసోసియేట్ పదవికి 13,533 ఖాళీలను భర్తీ చేయాలని ఐబీపీఎస్ లక్ష్యంగా పెట్టుకుంది.




# ప్రవర్ధమానంగా భారత లాజిస్టిక్స్

## ఈ రంగంలో పెరుగుతున్న పెట్టుబడులు.. కేంద్ర మంత్రి జయంత్ చౌదరి

హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): భారతదేశ లాజిస్టిక్స్ రంగం అధిక వృద్ధి దశాబ్దంలోకి ప్రవేశిస్తున్నదని.. ఇది భారతదేశ లాజిస్టిక్స్ రంగానికి సాంకేతికత ఆధారిత నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఒక ప్రధాన అడుగు అని కేంద్ర మంత్రి జయంత్ చౌదరి అన్నారు. దీనికి జాతీయ లాజిస్టిక్స్ విధానం, ప్రధానమంత్రి గతిశక్తి, మల్టీమోడల్ మౌలిక సదుపాయాలలో అపూర్వమైన పెట్టుబడులు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. ఉపాధిని పెంచడం, ఆయా రంగాలలో ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ శ్రామికశక్తిని నిర్మించడం వైపు దృష్టి సారించామని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లో సెంటర్ ఆఫ్ లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని నిర్మించుకుంటేనే ఈ పరివర్తన కొనసాగుతుందని చెప్పారు. రెడింగ్టన్ లిమిటెడ్ సీఎస్ఆర్ విభాగం, రెడింగ్టన్ ఫౌండేషన్, లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని స్థాపించిందని తెలిపారు. చెన్నైలోని సెంటర్ ఆఫ్ లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఫర్ ఎక్సలెన్స్ విజయం ఆధారంగా హైదరాబాద్‌లోని సెంటర్ ఆఫ్ లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఫర్ ఎక్సలెన్స్ ప్రారంభించినట్లు చెప్పారు. సెంటర్ ఆఫ్ లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఫర్ ఎక్సలెన్స్, హైదరాబాద్ వంటి కేంద్రాలు తదుపరితరం లాజిస్టిక్స్ నైపుణ్యం ఎలా ఉండాలో చూపిస్తాయని.. టెక్నాలజీ ఆధారితం, పరిశ్రమ-రూపకల్పన, నిజమైన కార్యాచరణ అవసరాలకు అనుగుణంగా ఆటోమేషన్, డిజిటల్ సరఫరా గొలుసులు, కొత్త మొబిలిటీ నమూనాలు ఈ రంగాన్ని బలోపేతం చేస్తాయన్నారు. రెడింగ్టన్ లిమిటెడ్‌లోని గ్లోబల్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ ఆర్.వెంకటేశ్ మాట్లాడుతూ చెన్నైలోని సెంటర్ ఆఫ్ లాజిస్టిక్స్ ట్రైనింగ్ ఫర్ ఎక్సలెన్స్, టెక్నాలజీ-ఎనేబుల్డ్ లెర్నింగ్ భారతదేశ లాజిస్టిక్స్ వర్క్‌ఫోర్స్ ఉపాధిని ఎలా మార్చగలదో నిరూపించిందన్నారు. సెక్టార్-నిర్దిష్ట సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అభివృద్ధి చేయడంపై మంత్రిత్వ శాఖ దృష్టి సారించినట్లు చెప్పారు.

## రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దు

### ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక.. ఆ మేరకే ఖరారు కానున్న రిజర్వేషన్లు

హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి కీలక నివేదికను సమర్పించింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. రిజర్వేషన్ల అంశాన్ని తేల్చడానికి ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా నివేదిక సమర్పించింది. డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈ నెల 24వ తేదీలోపు ఎన్నికల తేదీలను ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇటీవల హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో అదే రోజున విచారణ జరపనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ నెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. తెలంగాణ వ్యాప్తంగా 12,733 పంచాయతీలు, 1,12,288 వార్డుల్లో డిసెంబర్ 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది.

## భార్య, పిల్లల హత్య.. నిందితుడికి ఉరిశిక్ష

### వికారాబాద్ జిల్లా కోర్టు తీర్పు

వికారాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): భార్య, పిల్లల హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ తెలంగాణ రాష్ట్రం, వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2019లో వికారాబాద్ జిల్లాకు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లలను హత్య చేశాడు. అనంతరం దానిని ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఈ కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువైంది. నేరం యొక్క తీవ్రత, ఆధారాలను పరిశీలించిన వికారాబాద్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్ రెడ్డి నిందితుడికి ఉరిశిక్ష విధించారు. వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ప్రవీణ్ ఆరేళ్ల క్రితం ఈ హత్యలకు పాల్పడ్డాడు. మొదట భార్యతో గొడవపడ్డాడు. ఆ తర్వాత ఆమెను, ఐదేళ్ల కుమార్తెను ఇనుప రాడ్డుతో బలంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం తొమ్మిదేళ్ల కుమారుడి గొంతు నులిమి చంపేశాడు. హత్య చేసిన తర్వాత తాను కూడా ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ప్రవీణ్, ఆ తరువాత మనసు మార్చుకుని పోలీసులకు లొంగిపోయాడు.

## హైదరాబాద్‌లో వైవీ సుబ్బారెడ్డిపై సిట్ ప్రశ్నలు

### తిరుమల కల్తీ నెయ్యి కేసులో వేగవంతమైన దర్యాప్తు

హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం ఆరోపణలకు సంబంధించిన కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తును వేగవంతం చేసింది. ఇందులో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మాజీ ఛైర్మన్, వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డిని సిట్ అధికారులు విచారిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలోనే ఈ విచారణ కొనసాగుతోంది. తొలుత ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలని వైవీ సుబ్బారెడ్డికి సిట్ అధికారులు విజయవాడ నుంచి నోటీసులు జారీ చేశారు. అయితే, తాను అక్కడికి రాలేనని ఆయన సమాధానం ఇవ్వడంతో, సిట్ అధికారులే నేరుగా హైదరాబాద్ కు వచ్చి ఆయన ఇంట్లోనే ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో లడ్డూ తయారీకి నెయ్యి సరఫరా చేసిన సంస్థలు, వాటితో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఛైర్మన్ హోదాలో తీసుకున్న నిర్ణయాలపై అధికారులు వివరాలు రాబడుతున్నట్లు సమాచారం. ఇదే కేసులో ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) అప్పన్నను సిట్ అధికారులు అరెస్ట్ చేసి విచారించారు. ఆయన నుంచి పలు కీలక విషయాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఆ సమాచారం ఆధారంగానే ఇప్పుడు సుబ్బారెడ్డిని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విచారణ తర్వాత కేసులో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనని ఆసక్తి నెలకొంది.

## మోసపూరిత సంస్థలకు విరాళాలొద్దు: టీటీడీ

తిరుమల, నవంబర్ 20 (ఈవార్తలు): భక్తులను తప్పుదోవ పట్టించి విరాళాలు సేకరిస్తున్న కొన్ని సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్, సేవ్ టెంపుల్స్ డాట్ ఆర్గనైజేషన్ వంటి సంస్థలు మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తూ, భక్తుల మనోభావాలతో ఆడుకుంటూ విరాళాలు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని నాయుడు పేర్కొన్నారు. ఈ నెల 29న తిరుమల, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలను పుణ్యక్షేత్రాలుగా ప్రకటించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ సంస్థలు ప్రచారం చేస్తున్నాయని, ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఇలాంటి అనుమానాస్పద సంస్థలు చేసే ప్రచారాలను నమ్మవద్దని, వారి వలలో పడి విరాళాలు ఇచ్చి మోసపోవద్దని భక్తులకు ఆయన సూచించారు. భక్తులు అప్రమత్తంగా ఉండి, ఇలాంటి మోసపూరిత చర్యలను తిప్పికొట్టాలని టీటీడీ ఛైర్మన్ కోరారు.

## కేసులే వాళ్ల పని: కవిత



హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించేందుకు ఏసీబీకి రాష్ట్ర గవర్నర్ అనుమతి ఇవ్వడంపై ఆయన సోదరి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇతరులపై కేసులు పెట్టడం తప్ప బీజేపీకి మరో పని లేదని ఆమె ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ వైఫల్యం కారణంగా బస్తీల్లో ప్రజల ముఖం చూసే ధైర్యం కూడా కాంగ్రెస్ నేతలకు లేదని విమర్శించారు. అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రతిపక్ష నేతలపై కుట్రపూరితంగా కేసులు పెడుతున్నారని ఆమె మండిపడ్డారు. దేశంలో ప్రస్తుతం కుట్రపూరిత రాజకీయాలు నడుస్తున్నాయని, అందుకు తెలంగాణలోనే అనేక ఉదాహరణలు ఉన్నాయని కవిత అన్నారు. అయితే ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, దేశంలో చట్టం, న్యాయం ఉన్నాయని గుర్తుచేశారు. ఈ రాజకీయ కుట్రలను ప్రజలు తిప్పికొడతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. తాము నంబర్ వన్ అయితే, మిగతా వాళ్లంతా 2, 3, 4 స్థానాల్లోనే ఉంటారని ఆమె వ్యాఖ్యానించారు.

# విజన్ 2047 సలహామండలిలో పెద్దోళ్లు!

### రఘురాం రాజన్ సహా వివిధ రంగాల ప్రముఖులు.. కిరణ్ మంజుందార్ షా, అరవింద్ సుబ్రమణియన్‌కు చోటు.. ప్లానింగ్ డిపార్టుమెంట్ ఉత్తర్వులు




హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): 'తెలంగాణ రైజింగ్: విజన్ 2047' కోసం తెలంగాణ ప్రభుత్వం విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులతో కూడిన సలహా మండలిని ఏర్పాటు చేసింది. నోబెల్ గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ, మాజీ ఐఏఎస్ అధికారులు అరుణా రాయ్, హర్ష్ మందార్, భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్లు దువ్వూరి సుబ్బారావు, రఘురామ్ రాజన్, బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ తదితరులు ఈ సలహా మండలిలో సభ్యులుగా ఉంటారు. సీఐఐ మాజీ అధ్యక్షురాలు, ప్రథమ్ సీఈవో రుక్మిణీ బెనర్జీ, ఐక్యరాజ్యసమితి ఉన్నత స్థాయి సలహా బోర్డు సభ్యురాలు జయతి ఘోష్, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్, ఆర్థికవేత్త మరియు పబ్లిక్ పాలసీ నిపుణుడు డాక్టర్ సంతోష్ మెహ్రోత్రా, డిజిటల్ సృజనాత్మకత, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌లో నిపుణులు శాంతను నారాయణ్, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ హిమాన్షు, ప్రముఖ వాతావరణ నిపుణులు అరుణాభ ఘోష్, ప్రముఖ కాలమిస్ట్ మోహన్ గురుస్వామి సలహా మండలిలో ఇతర సభ్యులుగా వ్యవహరిస్తారు.'తెలంగాణ రైజింగ్: విజన్ 2047'కు వ్యూహాత్మక దిశానిర్దేశం, సూచనలు, సమీక్ష కోసం ఈ సలహా మండలిని ఏర్పాటు చేస్తూ ప్రణాళిక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్: విజన్ 2047' పేరుతో ఒక దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది రాబోయే 25 సంవత్సరాలలో రాష్ట్రం కోసం ఒక పరివర్తనాత్మక అభివృద్ధి ప్రణాళిక ఇది. సమగ్ర ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి, పౌరులందరికీ సమాన అవకాశాలు సాధించడం దీని ప్రధాన లక్ష్యాలు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సలహా మండలి 'తెలంగాణ రైజింగ్: విజన్ 2047'పై వ్యూహాత్మక పర్యవేక్షణ, మార్గదర్శనం చేస్తుంది.

## ఒకేసారి 130 మందికి ప్రమోషన్

### రేవంత్ సర్కార్ కీలక ఉత్తర్వులు

**పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగులకు పదోన్నతులు**

హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ఫైల్‌కు మోక్షం కల్పిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో సుమారు 140 మందికి పైగా ఉద్యోగులకు ప్రయోజనం చేకూరింది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలోని గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పించారు. 2018 కంటే ముందు ప్రమోషన్ పొందిన వారికి 10 శాతం కోటా కింద ఇప్పుడు సూపరింటెండెంట్లుగా అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలోని రెండు మల్టీ జోన్ల పరిధిలో అర్హులైన 9 మందికి పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (పీఆర్, ఆర్డీ) శాఖ డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 130 మందికి పైగా సీనియర్ అసిస్టెంట్లకు ఒకేసారి సూపరింటెండెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సంబంధిత మంత్రులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పీఆర్, ఆర్డీ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ నేతలు తెలిపారు.

## రేవంత్ రెడ్డి ఇప్పుడేం చేస్తారో చూస్తాం

### కేటీఆర్ ప్రాసిక్యూషన్‌పై బండి సంజయ్

కరీంనగర్, నవంబర్ 20 (ఈవార్తలు): ఫార్ములా ఈ-కారు రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ అనుమతిచ్చిన నేపథ్యంలో, ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ ఏమి చెబుతుందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించడాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, ఇప్పుడు ముఖ్యమంత్రి ఏమి చేస్తారో చూడాలని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని నిత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శిస్తుంటారని ఆయన గుర్తు చేశారు. ఇన్నాళ్లూ గవర్నర్ అనుమతి ఇవ్వవద్దనే ముఖ్యమంత్రి కోరుకున్నారని వ్యాఖ్యానించారు. అవినీతిపరుల ఆస్తులను జప్తు చేస్తామని రేవంత్ రెడ్డి గతంలో అన్నారని, ఇప్పుడు గవర్నర్ అనుమతి ఇచ్చినందున ఆ దిశగా ఏమైనా చర్యలు తీసుకుంటారా అని ఆయన ప్రశ్నించారు. మావోయిస్టుల అంశంపై కూడా బండి సంజయ్ స్పందించారు. అర్బన్ నక్సలైట్లు చిన్నపిల్లలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. కార్లలో తిరుగుతూ సొంత పైరవీలు చేసుకుంటూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అమాయక యువత అర్థం చేసుకోవాలని సూచించారు.

## కేసీఆర్ అనేది గతం భవిష్యత్తు కాంగ్రెస్‌దే

### స్థానికంలో 99 శాతం సీట్ల మావే.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



భువనగిరి, నవంబర్ 20 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మాదిరి తాము ఇక్కడ అరెస్టులు చేయడం లేదని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడదని స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో ఇకపై కేసీఆర్ అనేది గతమని ఆయన అన్నారు. ఆయన శకం ముగిసిందని, భవిష్యత్తు అంతా కాంగ్రెస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పాలన కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని, ఈ విషయం ప్రజలకు అర్థమైంది కాబట్టే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ ఆమోదం తెలిపిన విషయంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, తాము ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడబోమని స్పష్టం చేశారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ప్రతిపక్షమంతా ఎప్పుడో జైలులో ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో రాజకీయ జోక్యం లేదని అన్నారు. చట్ట ప్రకారమే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రతిపక్షల నేతల విచారణలో తమ ప్రమేయం ఉండదని తేల్చి చెప్పారు.

## బండి సంజయ్, కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ఊరట లభించింది. వారిపై నమోదైన కేసులను న్యాయస్థానం కొట్టివేసింది. 2023లో పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్‌పై కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించారనే ఆరోపణలతో కేటీఆర్, గోరటి వెంకన్నలపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజకీయ కక్షల కారణంగానే కేంద్ర మంత్రిపై కేసు నమోదు చేశారని బండి సంజయ్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు, దర్యాప్తులో పూర్తి వివరాలు లేవని పేర్కొన్న హైకోర్టు, ఈ కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# సంపాదన చేతకాని దద్దమ్మవి!

**భార్య నుంచి ఐబొమ్మ రవికి వేధింపులు?**

**బెడిసికొట్టిన మతాంతర ప్రేమ వివాహం**

**దర్యాప్తులో వెలుగులోకి ఆసక్తికర విషయాలు**

బషీర్‌బాగ్/హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తులో రవి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన, విషాదకరమైన కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నెల 14న కూకట్‌పల్లిలోని రవి నివాసంలో పోలీసులు తనిఖీలు చేసినప్పుడు ఇల్లు మొత్తం చిందరవందరగా, దుమ్ముపట్టి ఉండటాన్ని గమనించారు. వైవాహిక జీవితంలో ఎదురైన చేదు అనుభవం కారణంగా అతడు మనుషులపై నమ్మకం కోల్పోయి, గత నాలుగేళ్లుగా కుటుంబానికి దూరంగా ఒంటరిగా జీవిస్తున్నాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. తన ఆచూకీ బయటపడుతుందనే భయంతో ఇంట్లో పనివాళ్లను కూడా పెట్టుకోలేదు. అతడి సెల్‌ఫోన్‌లో కేవలం ఫుడ్ డెలివరీ బాయ్స్ నంబర్లు మాత్రమే ఉండటం పోలీసులను ఆశ్చర్యపరిచింది. ఇంటి డోర్‌కు కెమెరా అమర్చుకుని, ఎవరొచ్చినా ముందుగా పరిశీలించాకే తలుపు తీసేవాడని తేలింది. అమీర్‌పేట్‌లోని ఒక కోచింగ్ సెంటర్‌లో పరిచయమైన యువతిని రవి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారి కాపురం ఏడాది పాటు సంతోషంగా సాగింది. ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. అదే సమయంలో భార్య అక్క విదేశాల్లో తమ కుటుంబాలు ఉన్నతంగా ఉన్నాయని ఎగతాళి చేయడంతో పాటు, దానికి భార్య, అత్త వంత పాడటంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో భార్యాభర్తలు విడిపోయారు. భార్య తన కూతుర్ని తీసుకుని వెళ్లిపోవడంతో రవి పూర్తిగా ఒంటరివాడయ్యాడు. అప్పటి నుంచి పైరసీ, గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల నిర్వహణ, విదేశీ పర్యటనలతోనే కాలం గడుపుతున్నాడని దర్యాప్తులో వెల్లడైంది. కూతురిని చూడాలని ఉన్నా అవకాశం దక్కడం లేదని రవి ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం.

# పోలీసులకు ఐ'బొమ్మ' చూపిస్తున్నాడు!

### ఆరు గంటలపాటు రవి విచారణ.. నెట్‌వర్క్, ఇంటర్నెట్ సోర్సులపై ప్రశ్నలు.. మొబైల్‌లో దొరకని సమాచారం



బషీర్‌బాగ్/హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): ఐ-బొమ్మ ఇమంది రవి మొదటి రోజు విచారణ ముగిసింది. సైబర్ క్రైమ్ పోలీసులు అతనిని సుమారు ఆరు గంటల పాటు విచారించారు. వేలాది సినిమాలను పైరసీ చేసిన రవిని సైబర్ క్రైమ్ పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో అతని నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు రవిని వారం రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని సైబర్ క్రైమ్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, న్యాయమూర్తి ఐదు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో, అతన్ని మొదటి రోజు అదుపులోకి తీసుకుని బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నించారు. అతడి బ్యాంకు లావాదేవీలపై ఆరా తీశారు. నెట్‌వర్క్, ఇంటర్నెట్ సోర్సులపై విచారణ జరిపారు. ఇమంది రవిపై ఫారెనర్స్ యాక్ట్ సెక్షన్‌ను కూడా పోలీసులు చేర్చారు. ఎన్ఆర్ఈ, క్రిప్టో కరెన్సీ, వ్యాలెట్లు, బ్యాంకు ఖాతాలపై విచారణ చేశారు. ఐ-బొమ్మ తిరిగి యాక్టివేట్ కావడంపై కూడా ప్రశ్నించారు. వెబ్‌సైట్, ఐపీ అడ్రస్ సర్వర్లపై కూడా దృష్టి సారించారు. ఐ-బొమ్మ వెబ్‌సైట్‌ను నిర్వహించేందుకు నిందితుడు పలు అడ్రస్‌లు మార్చినట్లు విచారణలో గుర్తించారు. 65 మిర్రర్ ఆపరేటర్ల వివరాలపై పోలీసులు ప్రశ్నించారు. డబ్బుల వివరాలపై కూపీ లాగారు. కాగా, అతని మొబైల్‌లో పోలీసులకు ఎలాంటి సమాచారం లభించలేదని తెలుస్తోంది. తన మొబైల్‌లో కేవలం ఫుడ్ డెలివరీ యాప్స్‌ను మాత్రమే అతను ఉంచాడు. రవిని మరో నాలుగు రోజులు సైబర్ క్రైమ్ పోలీసులు ప్రశ్నించనున్నారు.



# కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు ధర

**అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ**

నాగర్ కర్నూల్, నవంబర్ 20 (ఈ వార్తలు) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను విక్రయించి మద్దతు ధర పొందాలని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ సూచించారు. గురువారం బల్మూరు మండలం కొండనాగుల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు శ్రమించి పండించిన ప్రతి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలని సూచించారు. యువకులకు ఇచ్చిన మాట ప్రకారం త్వరలో ఒక కోటి 50 లక్షలతో మినీ స్టేడియం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 30 మంది బాల కార్మికుల విముక్తి

**తాడూరు ఎస్సై గురు స్వామి**

నాగర్ కర్నూల్, నవంబర్ 20 (ఈవార్తలు): పాఠశాలకు వెళ్లాల్సిన పిల్లలు పత్తి చేలల్లో పనులకు వెళుతుండగా వాహనాలను నిలిపివేసి 30 మంది బాల కార్మికుల విముక్తి కల్పించినట్లు తాడూరు ఎస్సై గురుస్వామి తెలిపారు. గురువారం తాడూరు మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ముందు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుండి బొలెరో వాహనాలలో తాడూరు మండలం మెడిపూర్, యాదిరెడ్డిపల్లి తదితర గ్రామాలలో పత్తి తీసేందుకు 18 సంవత్సరాలలోపు ఉన్న 30 మంది పిల్లలు వచ్చారు. వారిని గుర్తించిన పోలీసులు.. పిల్లలను పనులకు పంపవద్దని వాహన డ్రైవర్లు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాడూరు ఎస్సై గురుస్వామి, హెడ్ కానిస్టేబుల్ సురేష్ కుమార్, పీసీఏ భాస్కర్. కోనేరు ఎన్జీవో ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ యాదవ్, జాకీర్ హుస్సేన్, కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ కల్పన, తాడూరు జూనియర్ కాలేజీ జూనియర్ లెక్చరర్ ప్రవీణ్ రెడ్డి, హోంగార్డు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## పుస్తకమే విద్యార్థి అసలైన స్నేహితుడు

**జగిత్యాల అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్**

జగిత్యాల టౌన్, నవంబర్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా గ్రంథాలయసంస్థ ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం ముగింపు సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) రాజాగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన.. విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి రోజు లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తకమే విద్యార్థి అసలైన స్నేహితుడు అని చెప్పారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రాము తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి నిందితుడి అరెస్ట్

సిరిసిల్ల, నవంబర్ 20 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. గురువారం ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన పిట్ల శ్రీకాంత్ బుధవారం టీఎస్ 07 హెచ్‌జే 6969 నెంబర్ కారులో ఇల్లంతకుంట నుంచి సిరిసిల్లకు వెళు తున్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేశారని.. దాంతో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులకు కూడా గాయాలయ్యాయని తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని గురువారం సాయంత్రం రహీంఖాన్ పేట గ్రామ శివారులో అరెస్ట్ చేశామని వెల్లడించారు. నిందితుడి నుంచి మారుతి సుజుకీ బలేనో కార్ సీజ్ చేశామని చెప్పారు. అతడిని జ్యుడీషియల్ కస్టడీ కోసం




రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

**అధికారులకు విప్ ఆది శ్రీనివాస్ ఆదేశం**

వేములవాడ, నవంబర్ 20 (ఈవార్తలు): వేములవాడ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలని అధికారులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు. పనుల పురోగతిపై రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్, రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్, గృహనిర్మాణ, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులతో వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. శాఖల వారీగా అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పనుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బీటీ రోడ్లు, సీసీ రోడ్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తవ్వాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని వంతెనల నిర్మాణం, రహదారులను వీలైనంత త్వరగా నిర్మించాలని అన్నారు. చెరువుల పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెరగాలని అన్నారు.



# 2029లో రప్పా.. రప్పా!

**బేగంపేట ఎయిర్ పోర్టులో వైసీపీ కార్యకర్తల హల్ చల్**

**నాంపల్లి సీబీఐ కోర్టు వద్దకూ భారీగా జనం**

బేగంపేట/నాంపల్లి, హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ గురువారం హైదరాబాద్ కు వచ్చారు. అక్రమాస్తుల కేసులో నాంపల్లిలోని సీబీఐ కోర్టులో విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ కార్యకర్తలు, జగన్ అభిమానులు బేగంపేట ఎయిర్ పోర్ట్ వద్ద, నాంపల్లి సీబీఐ కోర్టు సమీపంలో హల్ చల్ చేశారు. వైసీపీ జెండాలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ జగన్ కు అనుకూలంగా నినాదాలు చేశారు. '2029లో రప్పా రప్పా' అంటూ జగన్ అభిమానులు నినాదాలు చేయడం వివాదాస్పదంగా మారింది. బేగంపేట ఎయిర్ పోర్టు వద్దకు భారీ సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు రావడంతో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేసిన కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అటు.. జగన్ కోసం వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నాంపల్లి సీబీఐ కోర్టు వద్దకు చేరుకున్నారు. రోడ్డుపై గుంపులుగా చేరి నినాదాలు చేశారు. '2029లో రప్పా రప్పా' అంటూ రాసి ఉన్న బ్యానర్లను ప్రదర్శించారు.

**నిమిషాల్లోనే ముగిసిన విచారణ**

కోర్టు ప్రాంగణంలోకి వెళ్లిన తర్వాత జగన్ తొలుత వెయిటింగ్ గదిలోకి వెళ్లారు. విచారణ ప్రారంభం కాగానే, కోర్టు సిబ్బంది 'ఏ1 వైఎస్ జగన్మోహన్ రెడ్డి' అని పిలిచారు. వెంటనే ఆయన కోర్టు హాల్లోకి ప్రవేశించి, న్యాయమూర్తికి నమస్కరించారు. అనంతరం, న్యాయమూర్తి సూచన మేరకు హాజరు పట్టికలో సంతకం చేశారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే జగన్‌ను కోర్టు నుంచి వెళ్లేందుకు జడ్జి అనుమతించారు. విచారణ సందర్భంగా జగన్ ను జడ్జి ఎలాంటి ప్రశ్నలు అడగలేదు. కేవలం ఆయన హాజరును మాత్రమే జడ్జి పరిగణనలోకి తీసుకుని, సంతకం చేయించుకుని పంపించి వేశారు. రాబోయే రోజుల్లో పిటిషన్లపై విచారణ జరగనుంది. కోర్టు నుంచి బయటకు వచ్చిన జగన్, నేరుగా హైదరాబాద్‌లోని తన నివాసమైన లోటస్ పాండ్‌కు వెళ్లారు.


# 24 నుంచి ఏపీలో మీకోసం రైతన్నా!

**10 వేల మందితో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్**

అమరావతి, నవంబర్ 20 (ఈవార్తలు): వ్యవసాయ రంగంలో సమూల మార్పుల ద్వారా సాగును లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి కార్యక్రమాలు చేపట్టనుంది. 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి రైతు ఇంటికి వెళ్లనున్నారు. డిసెంబర్ 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొననున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో పాటు రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సహా 10 వేల మందితో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాతల సంక్షేమం కోసం, సాగు విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై ముఖ్యమంత్రి ప్రకటించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై టెలికాన్ఫరెన్స్‌లో ఆయా శాఖలకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి 'మీకోసం రైతన్నా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించనున్నారు.

# సీబీఐ కోర్టులో జగన్, సునీత..!

**ఎదురుపడ్డా మాటల్లేవ్, పలకరింపుల్లేవ్**



నాంపల్లి/హైదరాబాద్, నవంబర్ 20 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టులో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి ఆయన కుమార్తె డాక్టర్ సునీత, అక్రమాస్తుల కేసు విచారణ నిమిత్తం వైసీపీ అధినేత ఒకే సమయంలో కోర్టుకు హాజరయ్యారు. అయితే, కోర్టు ప్రాంగణంలో ఎదురుపడినప్పటికీ జగన్ తన సోదరి సునీతను పలకరించకుండానే వెళ్లిపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళితే, వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తును కొనసాగించాలన్న పిటిషన్‌పై వాదనల కోసం సునీత కోర్టుకు వచ్చారు. అదే సమయంలో, తనపై ఉన్న అక్రమాస్తుల కేసు విచారణలో భాగంగా జగన్ కూడా అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో కోర్టులో సునీతను చూసినప్పటికీ, జగన్ ఆమెతో మాట్లాడకుండా, పలకరించకుండానే ముందుకు సాగిపోయారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు కీలక వ్యక్తులు, వేర్వేరు కేసుల నిమిత్తం ఒకేసారి కోర్టుకు రావడం, కనీసం పలకరించుకోకపోవడం అక్కడున్న వారిని ఆశ్చర్యపరిచింది. వివేకా హత్య కేసులో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, బాబాయ్ కుమార్తెను జగన్ పలకరించకపోవడం రాజకీయంగానూ చర్చనీయాంశంగా మారింది.

## మత్స్యకార దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం: కొమ్ముల



నాగర్ కర్నూల్, నవంబర్ 20 (ఈవార్తలు): నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో నిర్వహించే ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని మత్స్యకార నాయకుడు, కోడేరు పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ముల ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లాపూర్ పట్టణంలో రాజగారి కోట సమీపంలో శుక్రవారం ప్రపంచ మత్స్యకారు దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కొల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల మత్స్యకారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. మత్స్యకార హక్కుల సాధనకై, కులవృత్తి పరంగా, సామాజికంగా, రాజకీయ అస్థిత్వ పోరాట బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు.

## చీరకు నిప్పంటుకొని వృద్ధురాలి మృతి

మల్యాల, నవంబర్ 20 (ఈవార్తలు): ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకోవడంతో తీవ్రగాయాలై ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ విషాదం జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని పోతారంలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పున్న లచ్చవ్వ (61) ఈ నెల 18న ఇంటి బయట ఉన్న గడ్డిని కాలుస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు అంటుకొని కాళ్లు, చేతులు, వీపు కాలిపోయాయి. జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మరణించింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



## అడ్లూరికి ఏడుమోటలపల్లి గ్రామస్థుల ధన్యవాదాలు

పెగడపల్లి, నవంబర్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఏడుమోటలపల్లిలో ఐకేపీ ధాన్యం సెంటర్ కోసం ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ఆ గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. గురువారం మంత్రిని కలిసిన ప్రజలు.. ధన్యవాదాలు తెలిపిన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో లైవ్ ఐక్య వేదిక గిరిజన బంజారా సంఘం ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షుడు నగావత్ జీవన్ నాయక్, ఏడుమోటాలపల్లి మాజీ సర్పంచ్ ఇస్లావత్ రవి నాయక్, హక్కుల పోరాట సమితి కన్వీనర్ నగావత్ శ్రీను నాయక్, అజ్మీరా రామ నాయక్, అజ్మీరా బక్క నాయక్, నగావత్ కిషన్ నాయక్, నగావత్ లక్ష్మణ్ నాయక్, అజ్మీరా హరిలాల్ నాయక్, ఈరవేణి రాజమల్లు, ఆకుల విష్ణు, తిరుపతి రెడ్డి, తిరుమల్ రెడ్డి, తోట తిరుపతి, కుంటయ్య, ఈరవేణి నరేశ్, అజ్మీరా రోజా, అజ్మీరా జ్యోతి, అజ్మీరా అంజన్న తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలను నం.1గా నిలపాలి

**నూతన ఎంపీడీవోలతో కలెక్టర్ సత్యప్రసాద్**



జగిత్యాల టౌన్, నవంబర్ 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలపాలని నూతన ఎంపీడీవోలకు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం వారితో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించిన కలెక్టర్.. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామస్థాయి పరిపాలన విధానాలపై చర్చించారు. గ్రామీణాభివృద్ధి వ్యవస్థలో ఎంపీడీవోలదే కీలక పాత్ర అని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, సమయానుసారంగా అందించేందుకు ప్రతి అధికారి నిబద్ధతతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాజా గౌడ్, డీపీవో రేవంత్, అడిషనల్ డీఆర్డీవో మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు కోరుట్లలో యూనిటీ మార్చ్

కోరుట్ల/జగిత్యాల, నవంబర్ 20 (ఈవార్తలు): దేశ నిర్మాణం దిశగా యువతలో స్ఫూర్తిని నింపేందుకు కోరుట్లలో శనివారం యూనిటీ మార్చ్ నిర్వహించనున్నట్లు మేరా యువభారత్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ వెంకట్ రాంబాబు తెలిపారు. కోరుట్ల గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ మినీ స్టేడియం నుంచి ప్రారంభమై నంది కమాన్ చౌరస్తా, కార్గిల్ చౌరస్తా, శ్రీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ గాంధీ రోడ్ మీదుగా మళ్లీ మినీ స్టేడియం వరకు కొనసాగనుందని వెల్లడించారు. ఈ మార్చ్‌లో యువత, విద్యార్థులు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పత్రిక ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# ఢిల్లీకి డీకే ఎమ్మెల్యేలు

## నేడు మరికొందరు హస్తినకు

**సీఎం పోస్టుపై అధిష్ఠానంపై ఒత్తిడి!**

**కర్ణాటకలో మారనున్న సీఎం?**

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు దాటిన నేపథ్యంలో డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలు ఈరోజు దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లినట్లు సమాచారం.

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై గత కొన్ని నెలలుగా చర్చ జరుగుతోంది. రెండున్నర సంవత్సరాలు పూర్తయినందున సిద్ధరామయ్య స్థానంలో డీకే శివకుమార్‌కు అవకాశమివ్వాలని ఆయన వర్గం కోరుకుంటోంది.



బెంగళూరు/న్యూఢిల్లీ: అయితే, పార్టీలో ముఖ్యమంత్రి మార్పు అంశాన్ని సిద్ధరామయ్య, శివకుమార్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వస్తున్నారు. తాజాగా, డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి మార్పు అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి పెంచేందుకు యోచిస్తున్నట్లుగా మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇచ్చిన హామీ ప్రకారం డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని ఆయన వర్గం ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానాన్ని కోరనున్నారని సమాచారం. ఈ మేరకు ఎమ్మెల్యేలు ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తమ డిమాండ్‌ను ఆయన దృష్టికి తీసుకువెళ్లనున్నారు. శుక్రవారం ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్‌ను కూడా కలుస్తారని సమాచారం. ఢిల్లీకి వెళ్లిన డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలలో దినేశ్ గూలిగౌడ, రవి గణిగ, గుబ్బి వాసు ఉండగా, అనేకల్ శివన్న, నేలమంగళ శ్రీనివాస్, ఇక్బాల్ హుస్సేన్, కునిగల్ రంగనాథ్, శివగంగ బసవరాజు, బాలకృష్ణ తదితరులు శుక్రవారం ఉదయం చేరుకోనున్నారని సమాచారం. 'నేను ఢిల్లీకి వెళ్లి బంగారం, వజ్రాలు ఏమైనా అడుగుతానా ఏమిటి? మా నాయకుడు డీకే శివకుమార్ కోసమే దేశ రాజధానికి వెళుతున్నాన'ని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ జాతీయ మీడియాతో అన్నారు. అంతకుముందు, డీకే సోదరుడు సురేశ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన మాటను నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నామని వ్యాఖ్యానించారు.



## మోదీని పొగుడుతూ కాంగ్రెస్‌లో ఎందుకు?

**థరూర్‌పై సందీప్ దీక్షిత్ ఫైర్**

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని ప్రశంసించిన కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ మరోసారి సొంత పార్టీ నేతల నుంచే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. రామ్‌నాథ్ గోయెంకా స్మారకోపన్యాసంలో ప్రధాని ప్రసంగాన్ని మెచ్చుకోవడం కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపింది. బీజేపీ వ్యూహాలే ఉత్తమమని భావిస్తే, ఆయన కాంగ్రెస్ పార్టీలో ఎందుకు కొనసాగుతున్నారని పార్టీ నేత సందీప్ దీక్షిత్ ఘాటుగా ప్రశ్నించారు. "శశి థరూర్‌కు దేశం గురించి పెద్దగా అవగాహన లేదని నేను భావిస్తున్నాను. కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా వెళ్తూ ఎవరో దేశానికి మంచి చేస్తున్నారని మీరు అనుకుంటే, వారి విధానాలనే అనుసరించండి. మరి కాంగ్రెస్‌లో ఎందుకు ఉన్నారు? కేవలం ఎంపీగా ఉండటానికేనా?" అని ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడైన సందీప్ దీక్షిత్ నిలదీశారు. ప్రధాని వ్యూహాలు మెరుగ్గా పనిచేస్తున్నాయని భావిస్తే వివరణ ఇవ్వాలని, లేకపోతే ఆయనో కపటధారి అని తీవ్రంగా విమర్శించారు. మంగళవారం థరూర్ 'ఎక్స్' వేదికగా ప్రధాని ప్రసంగం దేశ ఆర్థిక భవిష్యత్తుకు, సాంస్కృతిక కార్యాచరణకు పిలుపునిచ్చినట్లుగా ఉందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ కు చెందిన మరో నేత సుప్రియా శ్రీనతే కూడా తీవ్రంగా స్పందించారు. "ఆ ప్రసంగంలో ప్రశంసించడానికి ఏముందో నాకు అర్థం కాలేదు. అదొక చిల్లర ప్రసంగం. అక్కడ కూడా ఆయన కాంగ్రెస్‌ను విమర్శించారు" అని ఆమె అన్నారు. కాగా, థరూర్ ప్రధాని మోదీని లేదా కేంద్ర ప్రభుత్వ విధానాలను మెచ్చుకోవడం ఇదే మొదటిసారి కాదు.

## భారత పర్యటనకు ట్రంప్ కుమారుడు!

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారం భారత్‌లో పర్యటించనున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో జరిగే ఓ వివాహ వేడుకకు ఆయన కుటుంబ సమేతంగా హాజరుకానున్నారు. నవంబర్ 21, 22 తేదీల్లో ఈ వేడుక జరగనుంది. ఓ ప్రముఖ అమెరికన్ వ్యాపారవేత్త కుమారుడి డెస్టినేషన్ వెడ్డింగ్‌ను ఉదయ్‌పుర్‌లోని పిచోలా సరస్సు మధ్యలో ఉన్న సుప్రసిద్ధ జగ్ మందిర్ ప్యాలెస్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వస్తున్న ట్రంప్ జూనియర్, నగరంలోని లీలా ప్యాలెస్‌లో విడిది చేయనున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ జూనియర్ పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. అమెరికా సీక్రెట్ సర్వీసెస్‌కు చెందిన ఒక బృందం ఇప్పటికే ఉదయ్‌పుర్‌కు చేరుకొని ఏర్పాట్లను సమీక్షిస్తోంది. మరోవైపు, స్థానిక పోలీసులు విమానాశ్రయం నుంచి ప్యాలెస్ వరకు పటిష్ఠమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

# భవిష్యత్తులో ఉద్యోగాలు ఆప్షనల్

**ఏఐ, రోబోల వల్ల డబ్బుకూ విలువ ఉండదు.. ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు**

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భవిష్యత్తుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ, హ్యూమనాయిడ్ రోబోల విస్తృతితో భవిష్యత్తులో ఉద్యోగాలు చేయడం అనేది కేవలం ఒక ఐచ్ఛికం (ఆప్షనల్)గా మారుతుందని, డబ్బుకు కూడా పెద్దగా ప్రాధాన్యత ఉండదని జోస్యం చెప్పారు. వాషింగ్టన్‌లో జరిగిన యూఎస్-సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ కూడా పాల్గొన్నారు. రాబోయే పది, ఇరవై ఏళ్లలో మనుషులు చేయడానికి పనులేమీ ఉండవని మస్క్ అన్నారు. "భవిష్యత్తులో చాలా పనులు ఆప్షనల్‌గా మారతాయి. ఇప్పుడు మనం క్రీడలు లేదా వీడియో గేమ్స్‌ను ఎలా ఆడుతున్నామో, రేపు ఉద్యోగం కూడా అలాగే ఉంటుంది. అవసరం కోసం కాకుండా కేవలం అభిరుచిని బట్టి పనులు చేసే రోజులు రానున్నాయి" అని మస్క్ వివరించారు. ఏఐ, రోబోటిక్స్ పేదరికాన్ని పూర్తిగా నిర్మూలిస్తాయని ఆయన గట్టిగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. పేదరికం ఒక సామాజిక సమస్య కాదని, అదొక ఇంజినీరింగ్ సమస్య అని అభివర్ణించారు. "ఏఐ, రోబోటిక్స్ ప్రాథమిక వస్తువులు, సేవల ఖర్చులను గణనీయంగా తగ్గిస్తాయి. తద్వారా పేదరికం అంతమవుతుంది. ఏఐ, హ్యూమనాయిడ్ రోబోలు అందరినీ ధనవంతులుగా మారుస్తాయి" అని ఆయన పేర్కొన్నారు. హ్యూమనాయిడ్ రోబోల తయారీలో టెస్లా అగ్రగామిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇదే వేదికపై ఉన్న ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ మాట్లాడుతూ.. ఏఐ వల్ల ఉద్యోగాల్లో గణనీయమైన మార్పులు వస్తాయని అంగీకరించారు.



# శబరిమల రద్దీ వెనుక రాజకీయ కుట్ర

**కేరళ మంత్రి సంచలన ఆరోపణ**

శబరిమల, నవంబర్ 20 (ఈవార్తలు శబరిమల ప్రతినిధి): కేరళలోని ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగడంతో, స్వామివారి దర్శనానికి దాదాపు 12 గంటల సమయం పడుతోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. ప్రస్తుతం నిమిషానికి 65 మంది భక్తులు పవిత్రమైన 18 మెట్లు ఎక్కుతున్నారు. మండల-మకరవిళక్కు సీజన్ ప్రారంభమైన రెండో రోజే లక్ష మందికి పైగా భక్తులు తరలిరావడంతో యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా కనిపించింది. కిలోమీటర్ల మేర బారులు తీరిన భక్తులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి ప్రదేశాల కొరతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం కూడా స్పాట్ బుకింగ్ ద్వారా అనుమతించిన దానికంటే నాలుగు రెట్లు అధికంగా దాదాపు 20,000 మంది రావడంతో పరిస్థితి మరింత దిగజారింది. భక్తుల రద్దీ, అధికారుల వైఫల్యంపై కేరళ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కనీసం ఆరు నెలల ముందు నుంచే ఎందుకు ప్రణాళికలు సిద్ధం చేయలేదని అధికారులను ప్రశ్నించింది. ఇకపై రోజుకు 75 వేల మంది భక్తులకు మాత్రమే దర్శనం కల్పించాలని ట్రావెన్‌కోర్ దేవస్వోమ్ బోర్డును ఆదేశించింది. సోమవారం వరకు స్పాట్ బుకింగ్‌ను 5,000కు పరిమితం చేయాలని, వర్చువల్ క్యూ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఈ రద్దీ వెనుక రాజకీయ కుట్ర ఉందని కేరళకు చెందిన ఓ మంత్రి ఆరోపించారు. రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల వేళ గందరగోళం సృష్టించేందుకు కొందరు కావాలనే పర్యవేక్షణ లేని మార్గాల ద్వారా భక్తులను పంపించి ఈ పరిస్థితిని సృష్టించారని ఆయన ఆరోపించడం సంచలనం రేపుతోంది. ప్రస్తుతం దేవస్వోమ్ బోర్డు దిద్దుబాటు చర్యలు చేపడుతుండగా, పరిస్థితిని నిశితంగా గమనిస్తామని హైకోర్టు హెచ్చరించింది.



# మయన్మార్‌లో 125 మంది భారతీయులకు విముక్తి

న్యూఢిల్లీ: ఆగ్నేయాసియా దేశాల్లోని స్కామ్ కేంద్రాల్లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తరలించే ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా మయన్మార్‌లోని మయావడి ప్రాంతంలో ఉన్న స్కామ్ కేంద్రాల నుంచి విముక్తి పొందిన 125 మంది భారతీయులను ప్రభుత్వం బుధవారం సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చింది. థాయ్‌లాండ్‌లోని మే సోట్ పట్టణం నుంచి భారత వాయుసేన (ఐఏఎఫ్)కు చెందిన ప్రత్యేక సైనిక రవాణా విమానంలో వీరిని స్వదేశానికి తరలించినట్లు బ్యాంకాక్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు మయన్మార్‌లోని స్కామ్ కేంద్రాల నుంచి థాయ్‌లాండ్ మీదుగా మొత్తం 1,500 మంది భారతీయులను వెనక్కి తీసుకొచ్చినట్లు ఎంబసీ తెలిపింది. భారతీయుల తరలింపు ప్రక్రియలో థాయ్‌లాండ్ ప్రభుత్వానికి చెందిన వివిధ ఏజెన్సీలు, టాక్ ప్రావిన్స్ అధికారులు అందించిన సహకారం ఎంతో కీలకమని పేర్కొంది. స్వదేశానికి చేరుకున్న కొందరు భారతీయుల ఫొటోలను కూడా ఎంబసీ 'ఎక్స్' ఖాతాలో పంచుకుంది. ఈ సందర్భంగా విదేశాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నించే భారతీయులకు రాయబార కార్యాలయం కీలక సూచనలు చేసింది. ఉద్యోగ ఆఫర్లను స్వీకరించే ముందు విదేశీ కంపెనీలు, నియామక ఏజెంట్ల పూర్వాపరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని హెచ్చరించింది. అలాగే, భారతీయులకు థాయ్‌లాండ్ అందిస్తున్న వీసా రహిత ప్రయాణ సౌకర్యం కేవలం పర్యాటకం, స్వల్పకాలిక వ్యాపార పనుల కోసం మాత్రమేనని, దానిని ఉద్యోగాల కోసం దుర్వినియోగం చేయవద్దని స్పష్టం చేసింది. ఈ నెల 6న కూడా 270 మంది భారతీయులను రెండు సైనిక విమానాల్లో ప్రభుత్వం తరలించిన విషయం తెలిసిందే. మయన్మార్‌లోని కేకే పార్క్ అనే సైబర్ క్రైమ్ హబ్‌పై అక్కడి అధికారులు దాడులు చేయడంతో సుమారు 500 మంది భారతీయులు థాయ్‌లాండ్‌కు పారిపోయారు. వారిని గుర్తించి దశలవారీగా స్వదేశానికి తరలిస్తున్నారు.

# 31 కోట్ల మహిళలపై లైంగిక దాడులు!

**ప్రతి ముగ్గురిలో ఒకరు హింసకు బాధితులే**

**ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘన**

న్యూఢిల్లీ: మహిళలపై హింస ప్రపంచవ్యాప్తంగా అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా కొనసాగుతోందని, ఈ సమస్య పరిష్కారంలో గత రెండు దశాబ్దాలుగా చెప్పుకోదగ్గ పురోగతి లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. నవంబర్ 25న అంతర్జాతీయ మహిళా హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విడుదల చేసిన నివేదికలో అనేక దిగ్భ్రాంతికర విషయాలను వెల్లడించింది. గడిచిన 12 నెలల్లో ప్రపంచవ్యాప్తంగా 31.6 కోట్ల మంది మహిళలు, 1.25 కోట్ల మంది కౌమార బాలికలు లైంగిక హింసకు గురయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు (దాదాపు 84 కోట్ల మంది) తమ జీవితకాలంలో భాగస్వామి ద్వారా గానీ, ఇతరుల వల్ల గానీ హింసను ఎదుర్కొన్నారని, 2000 సంవత్సరం నుంచి ఈ సంఖ్యలో పెద్దగా మార్పు లేదని నివేదిక పేర్కొంది. 15-19 ఏళ్ల వయసున్న బాలికల్లో 16 శాతం మంది (1.25 కోట్లు) తమ భాగస్వామి చేతిలో శారీరక లేదా లైంగిక హింసకు గురైనట్లు తేలింది. భాగస్వామి ద్వారా జరిగే హింసను తగ్గించడంలో పురోగతి చాలా నెమ్మదిగా ఉందని, గత 20 ఏళ్లలో ఏటా కేవలం 0.2 శాతం మాత్రమే తగ్గిందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. భాగస్వాములు కాకుండా ఇతరుల వల్ల 15 ఏళ్ల వయసు నుంచి 26.3 కోట్ల మంది మహిళలు లైంగిక హింసకు గురయ్యారని, అయితే సామాజిక అపవాదు, భయం కారణంగా కొందరు వెల్లడించరని, దాని వల్ల ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. "మహిళలపై హింస మానవాళి ఎదుర్కొంటున్న పురాతన, విస్తృతమైన అన్యాయాలలో ఒకటి. అయినా దీనిపై చర్యలు చాలా తక్కువగా ఉన్నాయి. జనాభాలో సగం మంది భయంతో జీవిస్తున్న ఏ సమాజాన్నీ సురక్షితమైనదిగా పిలవలేం" అని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్-జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించి, నివారణ కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని, బాధితులకు అండగా నిలిచే వ్యవస్థలను బలోపేతం చేయాలని నివేదిక పిలుపునిచ్చింది.

# భారత్ అమ్ములపొదిలో జావెలిన్ క్షిపణులు

**అమెరికాతో కీలక ఒప్పందం**



న్యూఢిల్లీ: భారత్, అమెరికా మధ్య రక్షణ సంబంధాలు కొత్త శిఖరాలకు చేరుతున్నాయి. ఇరుదేశాల మధ్య బలపడుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యానికి నిదర్శనంగా, భారత్‌కు సుమారు 93 మిలియన్ డాలర్ల విలువైన సైనిక పరికరాల విక్రయానికి ట్రంప్ ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా అత్యాధునిక జావెలిన్ యాంటీ-ట్యాంక్ క్షిపణులు, ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్‌ను అమెరికా సరఫరా చేయనుంది. అమెరికా విదేశాంగ శాఖ ఈ అమ్మకానికి ఆమోదం తెలిపిందని, ఇందులో 45.7 మిలియన్ డాలర్ల విలువైన జావెలిన్ వ్యవస్థలు, 47.1 మిలియన్ డాలర్ల విలువైన ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్ ఉన్నాయని డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ ఒక ప్రకటనలో వెల్లడించింది. భారత్ మొత్తం 100 %ఖీ+వీ%-148 జావెలిన్ క్షిపణులు, 25 కమాండ్ లాంచ్ యూనిట్లు, 216 ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్ కోసం అభ్యర్థించినట్లు తెలిపింది. "ఈ ప్రతిపాదిత విక్రయం అమెరికా విదేశాంగ విధానం, జాతీయ భద్రతా లక్ష్యాలకు మద్దతు ఇస్తుంది. మా కీలక రక్షణ భాగస్వామి అయిన భారత్ భద్రతను మెరుగుపరచడం ద్వారా ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాల్లో రాజకీయ స్థిరత్వం, శాంతి, ఆర్థిక పురోగతికి దోహదపడుతుంది" అని డీఎస్‌సీఏ పేర్కొంది. ఈ ఒప్పందంతో భారత్ తన దేశీయ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకోగలదని వివరించింది. కొన్ని వారాల క్రితమే వాషింగ్టన్, న్యూఢిల్లీ మధ్య పదేళ్ల రక్షణ సహకార ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఈ విక్రయానికి ఆమోదం లభించడం గమనార్హం. అక్టోబర్ 31న కౌలాలంపూర్‌లో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా యుద్ధ కార్యదర్శి పీట్ హెగ్సెత్ ఈ చారిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ఇరుదేశాల మధ్య రక్షణ భాగస్వామ్యంలో నూతన శకానికి నాంది పలుకుతుందని అప్పట్లో రాజ్‌నాథ్ సింగ్ పేర్కొనగా, భారత్-అమెరికా రక్షణ సంబంధాలు మునుపెన్నడూ లేనంత బలంగా ఉన్నాయని హెగ్సెత్ అభిప్రాయపడ్డారు.

### వాట్సాప్‌లో లోపం..

# యూజర్ల డేటా లీక్!

న్యూఢిల్లీ: ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకునే ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్‌లో భారీ భద్రతా లోపం బయటపడింది. ఈ లోపం కారణంగా కోట్లాది మంది వినియోగదారుల ఫోన్ నంబర్లు బహిర్గతమయ్యే ప్రమాదం ఉందని వియన్నా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు గుర్తించారు. దీన్ని ఎవరైనా దుర్వినియోగం చేసి ఉంటే, ఇది చరిత్రలోనే అతిపెద్ద డేటా లీక్‌లలో ఒకటిగా నిలిచిపోయేదని వారు హెచ్చరించారు. సాధారణంగా ఎవరిదైనా ఫోన్ నంబర్‌ను మన ఫోన్‌లో సేవ్ చేయగానే, వారు వాట్సప్‌లో ఉన్నారో లేదో సులభంగా తెలిసిపోతుంది. చాలా సందర్భాల్లో వారి ప్రొఫైల్ ఫొటో, పేరు కూడా కనిపిస్తాయి. వాట్సప్‌కు ఇది ఎంతో ప్రయోజనకరమైన ఫీచర్ అయినప్పటికీ, ఇదే అతిపెద్ద బలహీనతగా మారింది. హ్యాకర్లు లేదా డేటా సేకరించే సంస్థలు ఒక కంప్యూటర్ ప్రోగ్రామ్ ద్వారా కోట్లాది ఫోన్ నంబర్లను వరుసగా చెక్ చేసి, ఏవి వాట్సప్‌లో యాక్టివ్‌గా ఉన్నాయో గుర్తించే ప్రమాదం ఉంది. ఇలా యూజర్ల ఫోన్ నంబర్లు, ఫొటోలు, పేర్లను పెద్ద మొత్తంలో సేకరించవచ్చు. ఇది వినియోగదారుల గోప్యతకు తీవ్ర భంగం కలిగిస్తుంది. ఈ లోపాన్ని పరీక్షించేందుకు పరిశోధకులు కేవలం అరగంట వ్యవధిలోనే దాదాపు 3 కోట్ల అమెరికన్ ఫోన్ నంబర్ల వాట్సప్ ఖాతాలను గుర్తించగలిగారు. వెంటనే ఆ డేటాను డిలీట్ చేసి, వాట్సప్ మాతృసంస్థ మెటాను అప్రమత్తం చేశారు. దీనిపై స్పందించిన మెటా, పరిశోధకులకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ లోపంపై వారితో కలిసి అధ్యయనం చేస్తున్నామని, దాన్ని సరిదిద్దే మార్గాలను అన్వేషిస్తున్నామని పేర్కొంది. అయితే, ఇప్పటివరకు ఈ లోపాన్ని ఎవరూ దుర్వినియోగం చేసినట్లు ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

## టీచర్ల వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్య

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల విద్యార్థి శౌర్య పాటిల్ సెంట్రల్ ఢిల్లీలోని తన పాఠశాల నుండి నేరుగా మెట్రో స్టేషన్‌కు వెళ్లి, ఎత్తైన ప్లాట్‌ఫారమ్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఢిల్లీలో తీవ్ర కలకలం రేపింది. విషయం తెలియగానే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విద్యార్థి సంచిలో సూసైడ్ నోట్‌ను గుర్తించారు. తనను ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ వేధిస్తున్నట్లు ఆ నోట్‌లో పేర్కొన్నాడు. "క్షమించండి మమ్మీ, నేను నిన్ను ఎన్నోసార్లు బాధపెట్టాను. చివరిసారిగా మళ్లీ బాధపెడుతున్నాను. పాఠశాలలో ఉపాధ్యాయులు అలా ఉన్నారు. నేనేం చెప్పను" అని లేఖ రాసుకొచ్చాడు. అతను రాసిన లేఖ అందరినీ కంటతడి పెట్టిస్తోంది. తన మరణానంతరం తన అవయవాలను ఎవరికైనా ప్రయోజనం చేకూర్చేలా దానం చేయాలని, తనను ఈ దుస్థితికి తీసుకువచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ నోట్‌లో కోరాడు. సంవత్సరం కాలంగా ఉపాధ్యాయులు తనను ఎగతాళి చేస్తూ మాట్లాడినట్లు శౌర్య పాటిల్ పేర్కొన్నాడు. తనను ఉపాధ్యాయులు వేధిస్తున్నారని తల్లిదండ్రులకు చెబితే, పాఠశాల నుంచి బహిష్కరిస్తామని కూడా ఉపాధ్యాయులు హెచ్చరించారని పేర్కొన్నాడు. తన కొడుకు ఆత్మహత్య చేసుకున్న రోజు ఉపాధ్యాయులు అతనిని డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్న వేదిక మీదనే అందరిముందు అవమానించారని శౌర్య తండ్రి ఆరోపించారు. ఉపాధ్యాయులు అవమానించిన సమయంలో తన కొడుకు వేదిక పైనే ఏడ్చాడని, దీంతో ఒక ఉపాధ్యాయుడు నిర్లక్ష్యంగా, 'ఎంత ఏడ్చినా మాకు అభ్యంతరం లేదు' అని చెప్పాడని తండ్రి వాపోయారు. తన కొడుకు ఆత్మహత్య చేసుకున్న తర్వాత ప్రిన్సిపల్ తనకు ఫోన్ చేసి ఏ సహాయం కావాలన్నా చేస్తామని చెప్పాడని, అలా అయితే తన కొడుకును తిరిగివ్వమని సమాధానం చెప్పానని కన్నీరుమున్నీరయ్యారు.

## గాయానికి ఫెవిక్విక్‌తో చికిత్స చేశాడు!

మీరట్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, మీరట్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యుడు ఒకరు రక్తస్రావం అవుతున్న చిన్నారికి కుట్లు వేయడానికి బదులుగా ఫెవిక్విక్ రాయడం కలకలం రేపింది. ఆ తర్వాత చిన్నారికి మరో ఆసుపత్రిలో వైద్యం చేయించవలసి వచ్చింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మీరట్‌లోని జాగృతి విహార్ కాలనీలో సర్దార్ జస్పిందర్ సింగ్ కుటుంబం నివసిస్తోంది. ఇటీవల ఆయన కుమారుడు ఇంటి వద్ద ఆడుకుంటుండగా తలకు గాయమైంది. కుమారుడిని దగ్గరలోని ఆసుపత్రికి తీసుకువెళ్లగా, విధుల్లో ఉన్న వైద్యుడు కుట్లు వేయడానికి బదులు ఫెవిక్విక్ తీసుకుని గాయంపై వేశారు. ఆ తర్వాత బాలుడు విలవిల్లాడగా, కాసేపట్లో తగ్గిపోతుందని వైద్యుడు తల్లిదండ్రులకు చెప్పారు. రాత్రి గడిచినప్పటికీ ఆ నొప్పి తగ్గకపోవడంతో వారు బాలుడిని మరో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే గాయంపై అంటుకుపోయిన ఫెవిక్విక్‌ను తొలగించేందుకు వైద్యులకు మూడు గంటల సమయం పట్టింది. ఆ తర్వాత గాయానికి కుట్లు వేశారు. ఒకవేళ ఫెవిక్విక్ కంట్లోకి జారి ఉంటే మరింత నష్టం జరిగి ఉండేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై దర్యాప్తు జరుగుతున్నట్లు మీరట్ ప్రధాన వైద్యాధికారి తెలిపారు.

## త్వరలో ట్రంప్-మస్క్ రీయూనియన్ పార్టీ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రముఖ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ మధ్య ఉన్న విభేదాలు సమసిపోయినట్లు కనిపిస్తోంది. తీవ్రమైన మాటల యుద్ధం తర్వాత వీరిద్దరూ మళ్లీ మంచి మిత్రులుగా మారారు. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌కు వైట్‌హౌస్‌లో ట్రంప్ ఇచ్చిన విందుకు మస్క్ హాజరుకావడమే ఇందుకు నిదర్శనం. ఈ కార్యక్రమంలో ట్రంప్ ఒకటి కాదు, మూడుసార్లు మస్క్ పేరును ప్రస్తావించి ప్రాధాన్యతనిచ్చారు. ఈ కార్యక్రమంలో తన వ్యాపార ప్రసంగం సందర్భంగా ట్రంప్ సరదాగా మాట్లాడుతూ.. "ఎలాన్, నేను మీతో ఉన్నందుకు మీరు చాలా అదృష్టవంతులు" అని అన్నారు. "అతను నాకు ఎప్పుడైనా సరిగ్గా కృతజ్ఞతలు చెప్పాడా?" అని కూడా చమత్కరించారు. ఆ తర్వాత మస్క్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "అమెరికాకు, ప్రపంచానికి మీరు చేసిన సేవలకు అధ్యక్షుడు ట్రంప్‌కు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. ఈ పోస్టులో ట్రంప్, సౌదీ యువరాజు, ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్‌తో కలిసి దిగిన ఫొటోలను కూడా పంచుకున్నారు. కొన్ని నెలల క్రితం వరకు ట్రంప్ ప్రభుత్వంలో మస్క్ 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ' విభాగానికి అధిపతిగా ఉన్నారు. మే 30న ఆ పదవి నుంచి వైదొలిగిన తర్వాత, ట్రంప్ ప్రతిపాదించిన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' అనే భారీ ప్రభుత్వ వ్యయ ప్రణాళికను ఆయన బహిరంగంగా విమర్శించారు. ఒకప్పుడు మస్క్‌ను తన మొదటి మిత్రుడు అని పిలిచిన ట్రంప్‌తో ఆయనకు దూరం పెరిగింది. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో కలిసి పనిచేసిన కాలాన్ని పురస్కరించుకుని మస్క్ మిత్రులు ఆస్టిన్‌లో ఒక పెద్ద రీయూనియన్ పార్టీని ప్లాన్ చేస్తున్నట్లు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. మస్క్ ఆధ్వర్యంలో 'డోగ్'లో పనిచేసిన డజన్ల కొద్దీ ఉద్యోగులు ఈ వారాంతంలో ఈ వేడుకలో పాల్గొంటారని తెలిపింది. ఈ కార్యక్రమానికి మస్క్ కూడా హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం.

## గాజాపై ఇజ్రాయెల్ దాడి .. 22 మంది మృతి

గాజా: పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ మరోసారి దాడులు చేసింది. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి ఇజ్రాయెల్ వైమానిక దళం (ఐఏఎఫ్) గాజాను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో మొత్తం 22 మంది ప్రాణాలు కోల్పోయినట్లు గాజా డిఫెన్స్ ఏజెన్సీ అధికారికంగా ప్రకటించింది. గాజా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, గాజా నగరంలో 12 మంది, ఖాన్ యూనిస్ ప్రాంతంలో మరో 10 మంది మరణించారు. ఈ మృతుల సంఖ్యను హమాస్ వర్గాలు ధ్రువీకరించాయి. అయితే, ఈ దాడులపై ఇజ్రాయెల్ మిలిటరీ భిన్నమైన వాదన వినిపిస్తోంది. తమ దేశంపై దాడి చేసేందుకు హమాస్ ఉగ్రవాదులు సిద్ధమవుతున్నారన్న సమాచారంతోనే ఈ దాడులు నిర్వహించినట్లు పేర్కొంది. ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకునే ఈ స్ట్రైక్స్ జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం స్పష్టం చేసింది. ఈ పరస్పర ఆరోపణల నేపథ్యంలో గాజా ప్రాంతంలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## లయ్యారి చిత్రం




# చెప్పు తెగుద్ది






### రజనీ ఫ్యాన్స్‌పై ఖుష్బూ ఫైర్!

సుందర్ సి దర్శకత్వంలో రజనీకాంత్– కమల్ హాసన్ కాంబినేషన్ మూవీ తలైవర్ 173ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని కమల్ హాసన్ తన సొంత బ్యానర్ లో నిర్మించాల్సి ఉంది. అయితే ప్రాజెక్టును ప్రకటించిన కొద్దిరోజులకే తాను దీని నుంచి తప్పుకుంటున్నట్టు సుందర్ సి అధికారికంగా పత్రిక ద్వారా ప్రకటించారు. దానికి తన కారణాలు తనకు ఉన్నాయని ఆయన చెప్పుకున్నారు. అయితే స్క్రిప్టు వర్కవుట్ కాకపోవడం వల్లనే అతడు ప్రాజెక్టు నుంచి వైదొలిగాడని వెల్లడైంది. కమల్ హాసన్ సైతం తాము రజనీకాంత్ కి నచ్చే స్క్రిప్టు కోసం ఎదురు చూస్తున్నామని ప్రకటించారు. సరైన స్క్రిప్ట్ లాక్ అయ్యాక తదుపరి వివరాలు వెల్లడిస్తామని అన్నారు. కానీ ఆ తర్వాత సుందర్.సిపై తలైవా రజనీకాంత్ అభిమానులు సోషల్ మీడియాల్లో అనూహ్య వ్యాఖ్యలతో విరుచుకుపడుతున్నారు. అతడు, అతడి కుటుంబంపై కొన్ని అసహ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యంగా దీనిని సుందర్ సి సతీమణి ఖుష్బూ సహించలేని పరిస్థితికి చేరుకుంది. నిర్మాతలు సరైన స్క్రిప్ట్‌ను ఖరారు చేయడంపై దృష్టి సారించినా, ఖుష్బూను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నందున ఆమె తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. 'రజనీకాంత్ ఈ సినిమాలో కుష్బూను ఐటెం సాంగ్‌లో నటించమని కోరినందుకే దర్శకుడు ఆ పాత్ర నుంచి తప్పుకున్నాడ'ని ఒక నెటిజన్ వ్యాఖ్యానించాడు. అయితే దీనికి ఖుష్బూ సూటిగా కౌంటర్ ఇచ్చారు. 'లేదు, దాని కోసం మీ కుటుంబం నుండి ఎవరినైనా తీసుకోవాలని మేం ఆలోచిస్తున్నాము' అని ఎదురుదాడి చేసారు. మరొక ట్రోలర్ ఇలా అన్నాడు. 'సుందర్ సి దయనీయమైన కథ కథనం కారణంగా రజనీ– కమల్ మీ భర్తను తమ బ్యానర్ చిత్రం నుండి బయటకు గెంటేసారు కాబట్టి భారతీయ చిత్ర పరిశ్రమ మీ భర్త సుందర్ సిని చెత్తబుట్టలో పడవేయాల్సిన సమయం ఆసన్నమైందా?' అని రాసాడు. దీనికి ఖుష్బూ ఘాటుగా స్పందించారు. 'నా చెప్పు సైజు 41. దానితో దెబ్బలు తినడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?' అని సీరియస్ అయ్యారు.



## ఎవరేమనుకున్నా పట్టించుకోను: పూజాభట్

బాలీవుడ్ నటి..డైరెక్టర్ కం ప్రొడ్యూసర్ పూజాభట్ విషయం ఏదైనా ముఖం మీదనే చెప్పేస్తుంది. ఎదుట వారు ఏమనకున్నా? తాను చెప్పాలనుకున్నది సూటిగా చెప్పేస్తుంది. ఇప్పటికే తన వ్యక్తిగత జీవితం గురించి ఎన్నో విషయాలు పంచుకుంది. కుటుంబం గురించి..తనకున్న వ్యసనాల గురించి ఎన్నోసార్లు ఓపెన్ గా మాట్లాడింది. ఈ నేపథ్యంలో తాజాగా ఒంటరి తనం గురించి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తనకు ఒంటరి జీవితమన్నది ఓ శాపం కాదని, ఓ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపింది. సింగిల్ గా ఉండటం అన్నది ఓ పవిత్రమైన అసైన్ మెంట్ గా భావిస్తానంది. ఎదుట వారి గురించి తనకు అవసరం లేదని..తాను ఎలా ఉన్నాను? అందులో ఎంత నిజాయితీగా ఉన్నాను ? అన్నది ఆలోచిస్తాను తప్ప ఎవరో ఏదో అనుకుంటారని మనసు చంపుకుని ఉండలేనంది. ఒంటరిగా ఉన్న వాళ్ల గురించి సమాజం ఎలా ఆలోచిస్తుంది? అన్న దాన్ని తాను పట్టించుకోనని...తనకు కావాల్సింది సమాజం నుంచి ఏంటి? అన్న దాని గురించి ఆలోచి స్తానంది. ప్రస్తుత సమాజంలో బలంగా లేకపోతే బ్రతకడం అంత సులభం కాదని అభిప్రాయపడింది.

## అతడితో ఉంటే సౌకర్యంగా ఫీలవుతా

తన ప్రియుడు కబీర్‌కి హృదయపూర్వక పుట్టినరోజు మెసేజ్ చేస్తూ నటి కృతిసనన్ కీలకవ్యాఖ్యలు చేసింది. 'నేను ఎవరితో అయితే సౌకర్యంగా ఉండగలనో ఆ వ్యక్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు! కబీర్.. ప్రపంచం మీ మంచి హృదయాన్ని ఎప్పటికీ మార్చకుండా ఉండుగాక!' అంటూ తన హృదయాన్ని ఆవిష్కరించింది కృతి. కాగా, ఈ జంట మధ్య వ్యవహారంపై పుకార్లు రెండేళ్లుగా ఉన్నాయి. పబ్లిక్ ఔటింగుల్లో చాలాసార్లు కలిసి కనిపించారు. మొదట దుబాయ్ పార్టీలో కెమెరా కంటికి చిక్కిన తరువాత ముంబైలో కొన్నిసార్లు ప్రైవేట్ పార్టీల్లో కలిసి కనిపించారు.





## గ్లామర్ మూడ్‌లో కృతిశెట్టి

వరుస ఫ్లాపులతో కృతి శెట్టి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. తెలుగులో అవకాశాలు లేవు కానీ తమిళ్ లో కృతి శెట్టికి పలు చాన్సులు వచ్చాయి. రవి మోహన్ తో జీనీ సినిమా చేస్తున్న కృతి శెట్టి ప్రదీప్ రంగనాథన్ తో ఎల్ఐకే కూడా చేసింది. ఈ రెండు సినిమాలు కూడా డిసెంబర్ లో రిలీజ్ కాబోతున్నాయి. అయితే, ఈమధ్య అమ్మడు ఫోటో షూట్స్ లో కూడా గ్లామర్ షోతో అదరగొట్టేస్తుంది. తనకు తొలి హిట్ ఇచ్చిన టాలీవుడ్‌ని దూరం చేసుకోవడం ఇష్టం లేని అమ్మడు ఎలాంటి అవకాశం ఇచ్చినా నాకు ఓకే అనేస్తుందట. ప్రస్తుతం లీడ్ హీరోయిన్ ఛాన్స్ లు కష్టమని భావించిన కృతి శెట్టి స్టార్ సినిమాల్లో ఒక స్పెషల్ సాంగ్ ఛాన్స్ ఇచ్చినా చేయడానికి నేను రెడీ అంటుందట.



## చీరలో హాట్‌గా దిశాపటానీ

బికినీ షూట్లు, మోనోకినీ షూట్లకు దిశా పటానీ లుక్స్‌కు తిరుగులేదు. అంతర్జాలంలో ఉన్న గిరాకీ గురించి విధితమే. పర్ఫెక్ట్ ఫిట్ బాడీతో ఫోటోషూట్ల క్వీన్‌గా దిశా పటానీ మైండ్ బ్లాకింగ్ ట్రీట్ నిరంతరంహీటెక్కిస్తూనే ఉంది. తాజాగా దిశా పటానీ నెవ్వర్ బిఫోర్ హాట్ లుక్ లో ప్రత్యక్షమైంది. అందమైన మంచి ముత్యాలు, మిరుమిట్ల క్రిస్టల్స్ తో తీర్చిదిద్దిన అద్భుతమైన శారీ లుక్ లో పటానీ మతులు చెడగొడుతోంది. గోల్డ్ కలర్ శారీ, డిజైనర్ రివీలింగ్ బ్లౌజ్ లో దిశా దేవతా సుందరిని తలపిస్తోంది. దిశా ఈ కొత్త లుక్ లో మతులు పోగొడుతోంది. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమలు సైతం కుళ్లుకునేంత అందంగా ఉందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



## ఎన్సీ 24 కోసం వారియర్‌లా!

నాగ చైతన్య పూర్తిగా రూట్ మార్చినట్లు కనిపిస్తోంది. కార్తీక్ దండు దర్శకత్వంలో వస్తున్న ఎన్సీ24 సినిమా కోసం చైతన్య చేస్తున్న మేకోవర్ చూస్తుంటే, అక్కినేని ఫ్యాన్స్ కు గూస్ బంప్స్ రావడం ఖాయం. తాజాగా విడుదలైన 'బిహైండ్ ది సీన్స్' వీడియో చూస్తే, ఇది చైతన్య కెరీర్ లోనే మోస్ట్ ఇంటెన్స్ ఫిల్మ్ కాబోతుందని అర్థమవుతోంది. ఈ వీడియోలో అందరినీ ఆశ్చర్యపరిచే విషయం ఏమిటంటే.. చైతన్య తీసుకుంటున్న శిక్షణ. 'జూజీ మాస్టర్' ఆధ్వర్యంలో చైతు కఠోరమైన ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. రోప్స్ పట్టుకుని వేలాడుతూ, కర్రసాము చేస్తూ, బాక్సింగ్ చేస్తూ.. ఒక వారియర్ లా కనిపిస్తున్నాడు. ఆ బాడీ లాంగ్వేజ్, ఆ కళ్ళలో ఉన్న కసి చూస్తుంటే.. ఈసారి బాక్సాఫీస్ దగ్గర కొత్త రికార్డులు సృష్టించడానికి చైతు ఫిక్స్ అయ్యాడనిపిస్తోంది.

## ఏప్రిల్‌లో ఉస్తాద్ భగత్ సింగ్

నిర్మాత రవిశంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్‌పై క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రం ఏప్రిల్‌లో విడుదలవుతుందని ప్రకటించారు. తమ ప్రొడక్షన్లో రానున్న కొత్త చిత్రం ఆంధ్ర కింగ్ తాలూకా ప్రమోషన్లలో భాగంగా ఆయన తమ సంస్థ సినిమాల గురించి మాట్లాడారు. రామ్ చరణ్ పెద్ది మూవీ మార్చిలోనే రాబోతోందని నొక్కి వక్కాణించిన




రవిశంకర్.. ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రీకరణ పూర్తి చేసుకుందని, వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపారు. సంక్రాంతికి సినిమాను రెడీ చేసే అవకాశమున్నా.. అప్పుడు చిరు సినిమా మన శంకర వరప్రసాద్ ఉండడంతో వేసవి వైపు దృష్టి మళ్లింది. మార్చిలో రామ్ చరణ్ సినిమా వస్తుంది కాబట్టి.. ఆ నెలను విడిచిపెట్టి ఏప్రిల్‌ను ఎంచుకున్నారు. మేలో ఎలాగూ చిరు మరో సినిమా విశ్వంభర వస్తుందనే అంచనాలున్నాయి. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్‌లో చిరు సరసన శ్రీలీల, రాశీ ఖన్నానటించారు.

## అసంతృప్తిగానే ఉన్నా



కథల ఎంపిక విషయంలో తాను చేసిన తప్పులు తనని ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటాయని దీపిక పడుకోన్ చెప్పింది. ఓం శాంతి ఓం నుంచి కల్కి 2898 వరకూ ఎన్నో సినిమాల్లో నటించినా.. వాటిలో చేసిన తప్పులు గుర్తొచ్చినప్పుడల్లా అసంతృప్తిగానే ఉంటానంది. తాను ఎంపిక చేసుకున్న ప్రతీ కథ విజయం కాలేదని... వాటి విషయంలో మరింత ఎక్కువగా బాధ పడతానంది. ఇంకొన్ని సార్లు తాను కేవలం డబ్బుకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి పని చేసానని అనుకుంటారని, కానీ తన మనసులో అలాంటి భావన లేకుండా పనిచేసినా అలాంటి సినిమాలు ఫెయిలైనా బాధ పడతానంది. తనని నమ్మి అవకాశం ఇచ్చిన వారు నష్టాల్లో ఉండటం తాను చూడలేనంది.



## వేలం ఆపేసి ట్రేడ్‌ను అనుమతించాలి: ఊతప్ప

ఐపీఎల్ 2026 మినీ వేలాన్ని ఆపేయాలని బీసీసీఐకి భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సూచించాడు. ఈ వేలం ప్రక్రియను ఆపేసి ఏడాది పాటు ఆటగాళ్లను ట్రేడ్ చేసుకునే అవకాశం కల్పించాలన్నాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఐపీఎల్‌లో మార్పులు చేయాలని తెలిపాడు. రెండున్నర నెలల పాటు నిర్వహిస్తున్న ఈ టోర్నీని 6 నెలల టోర్నీగా మార్చాలని సూచించాడు. ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ప్రాతినిధ్యం వహించిన రాబిన్ ఊతప్ప 205 మ్యాచ్‌లు ఆడి 4952 పరుగులు చేశాడు. 2014లో కేకేఆర్ టైటిల్ గెలవడంలో రాబిన్ ఊతప్ప 660 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఐపీఎల్ గురించి మాట్లాడిన రాబిన్ ఊతప్ప.. లీగ్ స్వరూపాన్ని మార్చాలన్నాడు. 'ఐపీఎల్ టోర్నీని స్టార్టప్ దశకు మించి తీసుకెళ్లడం లేదు. ప్రపంచంలోనే అత్యుత్తమ క్రికెట్ లీగ్ ఇది. మారుతున్న కాలానికి అనుగుణంగా టోర్నీని మార్చాలి. వేలం ప్రక్రియను నిలిపేసి ఏడాది పాటు ట్రేడ్ విండో తెరిచి ఉంచాలి. వేలాన్ని పక్కన పెట్టి డ్రాఫ్ట్ సిస్టమ్‌ను తీసుకు రావాలి. నేను ఐపీఎల్ ఆడుతున్నప్పటి నుంచి ఈ విషయం చెబుతున్నా. కానీ వారు టీవీ వినోదం గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు. డ్రాఫ్ట్ విధానం అంతకంటే గొప్పది కావొచ్చు. ఇది అభిమానులను ఆకట్టుకుంటుంది. దీన్ని అమలు చేయండి. అంతేకాకుండా ఐపీఎల్ 6 నెలల లీగ్‌లాగా ఉండాలని నేను భావిస్తున్నాడు. మధ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లను నిర్వహించాలి. కానీ, ఐపీఎల్ అభివృద్ధి చెందాలి'అని రాబిన్ ఊతప్ప పేర్కొన్నారు.డ్రాఫ్ట్ సిస్టమ్ అంటే ఆటగాళ్లను సమాన పద్ధతిలో జట్లకు కేటాయించడానికి ఉపయోగించే విధానం. అత్యుత్తమ ప్రతిభను కనబర్చే క్రికెటర్లపై ఒక ఫ్రాంచైజీ గుత్తాధిపత్యం ఉండకుండా జట్ల బలబలాల మధ్య సమతుల్యం తీసుకురావడానికి దీన్ని ప్రవేశపెట్టారు. డ్రాఫ్ట్‌లో అర్హత ఉన్న ఆటగాళ్ల సమూహం నుంచి జట్లు వంతులవారీగా ఎంపిక చేసుకుంటాయి.



# మన నిఖత్ బంగారం

### పంచ్‌తో విజేతగా నిలిచిన నిజామాబాద్ బిడ్డ

భారత మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ పసిడి పంచ్ విసిరింది. విశ్వవేదికపై తన పంచ్ పవర్ చూపించిన ఇందూరు బిడ్డ దేశానికి ఐదో బంగారు పతకం అందించింది. వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో చెలరేగిపోయిన నిఖత్ 51 కిలోల విభాగంలో ప్రత్యర్థి గ్జువాన్ యూ గువోను మట్టికరిపించి విజేతగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపరిచిన తను.. ఇప్పుడు యావత్ దేశం, తెలంగాణ రాష్ట్రం గర్వపడే విజయం సాధించింది. స్వదేశంలో జరుగుతున్న వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో నిఖత్ జరీన్ తడాఖా చూపించింది. రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్ అయిన ఆమె.. గ్రేటర్ నోయిడాలో ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపిస్తూ ఫైనల్ చేరింది. సెమీస్‌లో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ గనీవ గుల్సెవర్‌పై సంచలన విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది నిఖత్. కఠినమైన గుల్సెవర్‌ను ఓడించి ఉత్సాహంతో ఫైనల్లోనూ జోరు చూపింది నిఖత్. తనదైన దూకుడుతో చైనీస్ తైపీకి చెందిన గువో యూ గ్జువాన్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. మ్యాచ్ ఆసాంతం ఆధిపత్యం చెలాయించిన భారత బాక్సర్ 5-0తో విజేతగా నిలిచింది. ఇదే పోటీల్లో నలుగురు భారత బాక్సర్లు స్వర్ణంతో మెరిశారు. 48 కిలోల విభాగలో మీనాక్షి హుడా, ప్రీతి పవార్(54 కిలోలు), అరుంధతి (70 కిలోలు), నుపుర్ షోరాన్(84 కిలోలు) దేశానికి పసిడి పతకం అందించి మురిసిపోయారు.

## 23న స్మృతి మందన్నా పెళ్లి

భారత మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు పెళ్లి కళ వచ్చేసింది. వరల్డ్ కప్ ముగియడమే ఆలస్యం ఆమె వివాహంపై మొదలైన వార్తలకు ఎట్టకేలకు ముగింపు పడింది. బాలీవుడ్ సింగర్ పలాశ్ ముచ్చల్ తో గత ఆరేళ్లుగా ప్రేమలో మునిగితేలుతున్న మంధాన నవంబర్ 23న అతడిని మనువాడనుంది. ఈ స్టార్ జంట పెళ్లి తేదీని ప్రధాని నరేంద్ర మోడీ అధికారికంగా వెల్లడించారు. కల్యాణ వేడుకకు మరో మూడు రోజులు ఉండడంతో మంధాన తన నిశ్చితార్థం ఉంగురాన్ని చూపిస్తూ మురిసిపోయింది. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరలవుతోంది.



## ధోనీ తర్వాత పంతే!

### చరిత్ర సృష్టించనున్న వికెట్ కీపర్

టీమిండియా స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ చరిత్ర సృష్టించనున్నాడు. దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తర్వాత టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్న వికెట్ కీపర్‌గా నిలవనున్నాడు. గౌహతి వేదికగా శనివారం నుంచి సౌతాఫ్రికాతో ప్రారంభమయ్యే రెండో టెస్ట్‌తో రిషభ్




పంత్ ఈ ఫీట్ సాధించనున్నాడు. ఈ మ్యాచ్‌కు శుభ్‌మన్ గిల్ దూరం కానున్నాడు. తొలి టెస్ట్ సందర్భంగా మెడ గాయానికి గురైన శుభ్‌మన్ గిల్ ఇంకా కోలుకోలేదు. బుధవారం భారత జట్టుతో కలిసి అతను గౌహతి వెళ్లినా.. మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ సాధించే అవకాశాలు లేవు. శుభ్‌మన్ గిల్ గాయంపై బీసీసీఐ అప్‌డేట్ ఇచ్చినా.. రెండో టెస్ట్‌కు అతన్ని దూరంగా ఉంచాలని టీమిండియా మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో టీమిండియాను నడిపించిన వైస్ కెప్టెన్ రిషభ్ పంతే.. రెండో టెస్ట్‌లోనూ సారథ్యం వహించనున్నాడు. పూర్తి స్థాయి కెప్టెన్‌గా రిషభ్ పంత్‌కు ఇదే తొలి టెస్ట్ మ్యాచ్. అతనే కెప్టెన్‌గా బరిలోకి దిగితే.. ధోనీ తర్వాత భారత జట్టును నడిపించిన రెండో వికెట్‌కీపర్‌గా చరిత్రకెక్కుతాడు.




# సిరీస్‌పై సఫారీల కన్ను!

### 15 ఏళ్ల కల కోసం బవుమా బ్యాచ్ కన్ను

భారత గడ్డపై పదిహేనేళ్ల తర్వాత తొలి టెస్టు విజయాన్ని రుచిచూసిన దక్షిణాఫ్రికా సిరీస్ విజయంపై కన్నేసింది. కీలకమైన గువాహటి టెస్టులోనూ గెలిచి సిరీస్ పట్టేయాలనే పట్టుదలతో ఉంది తెంబా బవుమా బ్యాచ్. ఇప్పటికే అక్కడకు చేరుకున్న సఫారీలు నెట్స్‌లో సన్నద్ధత షురూ చేశారు అయితే.. ప్రధాన పేసర్ కగిసో రబడ ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొనలేదు. అలానే ఈడెన్ గార్డెన్స్‌లో భారత్‌ను దెబ్బకొట్టిన స్పిన్నర్ సైమన్ హార్మర్ కూడా భుజం గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. మ్యాచ్‌కు రెండు రోజులే ఉన్నందున బౌలింగ్ కోచ్ పియెట్ బొథా వీరిద్దరి గురించి త్వరగా నిర్ణయం తీసుకుంటామని చెప్పాడు. తొలి టెస్టుకు ముందు ట్రైనింగ్ సెషన్‌లో గాయపడిన రబడ మ్యాచ్‌కు దూరమయ్యాడు. పక్కటెముకల గాయంతో బాధపడుతున్న ఈ స్పీడ్‌స్టర్ రెండో మ్యాచ్‌లోనూ ఆడడం సందేహమే అనిపిస్తోంది. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్న రబడ కోలుకునేందుకు మరింత సమయం పట్టనుంది. దాంతో.. గువాహటి మ్యాచ్‌లోపు ఈ పేస్ గన్ ఫిట్‌నెస్ సాధించాలని సఫారీ టీమ్ గట్టిగా కోరుకుంటోంది. ఇదే విషయమై బౌలింగ్ కోచ్ బొథాను సంప్రదించగా.. 'రబడ ఆరోగ్యాన్ని మేము పరిశీలిస్తున్నాం. ఈరోజు నెట్స్ బౌలింగ్ సెషన్స్‌లో అతడు పాల్గొనలేదు. మరో 24 గంటల్లో అతడు రెండో టెస్టులో ఆడడంపై నిర్ణయం తీసుకుంటాం. ఇక ఈడెన్ గార్డెన్స్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న స్పిన్నర్ సైమన్ హార్మర్ ఆరోగ్యం నిలకడగానే ఉంది. అతడి భుజంతో పెద్ద సమస్యేమీ లేదు. కోల్‌కతాలో మాదిరిగానే గువాహటిలో బంతి త్వరగా టర్న్ అయిందంటే భారత లెఫ్ట్ హ్యాండర్లకు అతడు ప్రమాదకారిలా మారతాడు. మేము గువాహటి పిచ్‌ను పరిశీలించాం. వికెట్ మీద గడ్డి బాగానే ఉంది. మ్యాచ్‌కు రెండు రోజులే ఉన్నందున మరింత పశ్చికను తొలగిస్తారని కచ్చితంగా చెప్పలేను' అని బొథా తెలిపాడు.

## పొట్టి దేశం.. ప్రపంచకప్‌కు అర్హత!

పట్టుదల ఉంటే ప్రతికూల పరిస్థితులను కూడా అధిగమించవచ్చని పసికూన దేశం కురుసావ్ నిరూపించింది. కేవలం 1,56,115 మంది జనాభా కలిగిన కురుసావ్ దేశం.. ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా టోర్నీ అయిన ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. తద్వారా 95 ఏళ్ల చరిత్ర కలిగిన ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించిన అతి చిన్న దేశంగా క్యురసావ్ నిలిచింది. ఉత్తర, మధ్య అమెరికా, కరీబియన్ జోన్ క్వాలిఫయింగ్ టోర్నీలో క్యురసావ్ గ్రూప్ బీ విజేతగా నిలిచి తొలిసారి ప్రపంచకప్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈ క్రమంలో జనాభా పరంగా




ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందిన అతి చిన్న దేశంగా ఐస్‌లాండ్ పేరిట ఉన్న రికార్డును క్యురసావ్ అధిగమించింది. 2018లో 3,50,000 జనాభా ఉన్న ఐస్‌లాండ్ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. కరీబియన్ దీవుల్లో 444 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో ఉన్న ఈ ద్వీపదేశం.. జమైకా జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ బీ చివరి లీగ్ మ్యాచ్‌ను 0-0తో డ్రా చేసుకుంది. తద్వారా నాలుగు జట్లున్న గ్రూప్-బీలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో మూడు గెలిచి, మరో మూడు డ్రా చేసుకొని 12 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. నెదర్లాండ్స్‌కు చెందిన ప్రముఖ కోచ్ డిక్ అడ్వోకాట్ ఆధ్వర్యంలో క్యురసావ్ ఈ ఘనతను సాధించింది.

### ప్రపంచకప్‌కు అర్హత సాధించిన దేశాలు

అమెరికా, కెనడా,మెక్సికో, ఆస్ట్రేలియా, సెనెగల్, సౌతాఫ్రికా, ట్యూనిషియా, క్యురసావ్, హైతీ, పనామా, ఇరాన్, జపాన్, జోర్డాన్, సౌత్ కొరియా, ఖతర్, సౌదీ అరేబియా, ఉజ్బెకిస్తాన్, అల్జీరియా, కేప్ వెర్డె, ఐవరీకోస్ట్, ఈజిప్ట్, ఘనా, మొరాకో, అర్జెంటీనా, బ్రెజిల్, కొలంబియా, ఈక్వెడార్, పరాగ్వే, ఉరుగ్వే, న్యూజిలాండ్, ఆస్ట్రియా, బెల్జియం, క్రొయేషియా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, నార్వే, పోర్చుగల్, స్కాట్లాండ్, స్పెయిన్, స్విట్జర్లాండ్.




## ఆ పాపమే గంభీర్‌ను వెంటాడుతోంది: మనోజ్ తివారీ

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ ఆగ్రహం వ్యక్తం చేశాడు. సరిగ్గా కోచింగ్ ఇవ్వకుండా ఆటగాళ్లను నిందించడం ఏంటని ప్రశ్నించాడు. ఇంకొన్నాళ్లు టెస్ట్ క్రికెట్ ఆడాలని భావించిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను రిటైర్మెంట్ తీసుకునేలా గంభీర్ ఒత్తిడి చేశాడని, ఆ తప్పిదమే ఇప్పుడు వెంటాడుతుందని ఘాటు వ్యాఖ్యలు చేశాడు. 'భారత క్రికెట్‌లో ట్రాన్సిషన్ ఫేజ్‌కు చోటు లేదు. అసలు భారత జట్టుకు ఈ అవసరమే లేదు. న్యూజిలాండ్, జింబాబ్వే వంటి దేశాలకు ఈ ట్రాన్సిషన్ ఫేజ్ అవసరం. మన దేశవాళీ క్రికెట్‌లో ఎంతో మంది ప్రతిభ కలిగిన ఆటగాళ్లు ఉన్నారు. సత్తా చాటేందుకు అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇంకొంత కాల టెస్ట్ క్రికెట్ ఆడాలని భావించారు. కానీ ట్రాన్సిషన్ ఫేజ్ అంటూ వారిపై అనవసర ఒత్తిడి తీసుకొచ్చాడు. దాంతో వారు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. సౌతాఫ్రికాలో తొలి టెస్ట్ ఓటమికి బ్యాటర్లను బాధ్యులను చేయడం సరికాదు.

## భారత ఒలింపిక్ అథ్లెట్‌పై కేసు

భారత మహిళా జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ అథ్లెట్ అన్ను రాణి చిక్కుల్లో పడింది. ఆమెతో పాటు భర్త, దేశవాళీ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్ సహిల్ భరద్వాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరి వివాహ వేడుక సందర్భంగా తుపాకీతో గాలిలోకి కాల్పులు జరిపారనే ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మార్చుకునే కార్యక్రమం సందర్భంగా అన్ను రాణి, సాహిల్ భరద్వాజ్ తుపాకీతో గాల్లోకి కాల్పులు జరిపారు. ఇందుకు సంబంధించిన వీడియో అవ్వడంతో పోలీసులు వారిపై ఆర్మ్స్ చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టారు. ఉత్తరాది రాష్ట్రాల్లో వివాహ వేడుకల్లో గాల్లో కాల్పులు జరపడం సర్వ సాధారణమే.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శుక్రవారం 21-11-2025 | www.evarthalu.com



# సాగదీత తప్ప సాగేది ఉండదు!

తెలంగాణలో రాజకీయం ఇప్పుడు 'ఫార్ములా ఈ' రేసింగ్ ట్రాక్‌పై పరుగులు పెడుతోంది. గతంలో హైదరాబాద్‌కు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టిన ఈవెంట్ నిర్వహణలో అవకతవకలు జరిగాయంటూ, నాటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రస్తుత ప్రభుత్వం విచారణకు ఆదేశించడం కేవలం రాజకీయ కక్ష సాధింపు తప్ప మరొకటి కాదు. ఈ మొత్తం వ్యవహారాన్ని లోతుగా పరిశీలిస్తే, ప్రభుత్వానికి ఇందులో సాంకేతికంగా లేదా చట్టపరంగా దక్కే ప్రయోజనం ఏమీ లేదని స్పష్టమవుతోంది.



**నవీన్ పోగుల**
తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల ఫోరం ప్రధాన కార్యదర్శి

ఇది కేవలం ప్రతిపక్ష నాయకుడిని బదనాం చేసే ఉద్దేశంతో చేస్తున్న 'రాజకీయ గారడీ' మాత్రమే. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి కుమారుడిగా, ప్రస్తుత ప్రతిపక్షంలో బలమైన గొంతుకగా ఉన్న కేటీఆర్‌ను వ్యక్తిగతంగా దెబ్బతీయడం, తద్వారా బీఆర్ఎస్ పార్టీని నైతికంగా బలహీనపరచడం ప్రస్తుత అధికార పక్షం ప్రధాన రాజకీయ లక్ష్యం. ఫార్ములా ఈ రేసును కేటీఆర్ తన హయాంలో ప్రపంచ స్థాయి విజయంగా ప్రచారం చేసుకున్నారు. అదే అంశాన్ని 'అవినీతి కేంద్రం'గా చిత్రీకరిస్తే, ఆయన ప్రతిష్టకు భంగం కలుగుతుందని అధికార పార్టీ భావిస్తోంది. అంతర్జాతీయ ఈవెంట్లు, ముఖ్యంగా క్రీడా పోటీల విషయంలో ఒప్పందాలు రద్దు కావడం, నష్టపరిహారాలు చెల్లించడం అత్యంత సాధారణమైన వాణిజ్య ప్రక్రియలు. ఇందులో 'నిధుల దుర్వినియోగం' లేదా 'అధికార దుర్వినియోగం' వంటి తీవ్రమైన నేరాలు ఉన్నాయని రుజువు చేయడం న్యాయస్థానంలో అగ్నిపరీక్ష లాంటిది. పక్కా ఆధారాలు లేకుండా కేవలం పాలసీ నిర్ణయాలను తప్పుబట్టడం చట్టపరంగా నిలబడదు. ఈ కేసు న్యాయస్థానాలకు చేరితే, అది దశాబ్దాల పాటు సాగే పోరాటంగా మారుతుంది. దీనివల్ల ప్రభుత్వ వనరులు, ప్రజాధనం, సమయం వృథా అవుతుంది తప్ప, కేటీఆర్‌కు శిక్ష పడడం లేదా కోల్పోయిన ఆర్థిక లాభాలు తిరిగి రావడం వంటి నిర్దిష్ట ప్రయోజనాలు ఏవీ చేకూరవు. ఇటువంటి రాజకీయ కేసులు, విచారణల పేరుతో ప్రభుత్వం తమ ప్రధాన బాధ్యతలైన పాలన, అభివృద్ధి, ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారించలేకపోతోంది. తెలంగాణ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం కేటీఆర్‌ను బదనాం చేయాలని పడుతున్న కష్టం అర్థం చేసుకోవచ్చు. కానీ, అంతిమంగా ప్రజలు కోరుకుంటున్నది మెరుగైన పాలననే తప్ప, రాజకీయ కక్ష సాధింపులను కాదు. ఫార్ములా–ఈ కేసు కేవలం అపవాదుల పుట్టగా మిగిలిపోతుందే తప్ప, ఇందులో ప్రభుత్వానికి చట్టపరంగా లేదా ఆర్థికంగా దక్కేదేమీ ఉండబోదు. రాజకీయ ప్రయోజనం కోసం ఎంత కష్టపడినా, సాంకేతికంగా శూన్యమైన కేసులను తవ్వితీసి ప్రజాధనాన్ని వృథా చేయకుండా, పాలనపై దృష్టి సారించడం ప్రస్తుత ప్రభుత్వానికి శ్రేయస్కరం.

# గ్యాస్ చాంబర్లు.. మన నగరాలు

కాలుష్యం.. అందులోనూ ముఖ్యంగా వాయు కాలుష్యం ప్రధాన ప్రజా ఆరోగ్య సమస్యగా, పర్యావరణ విపత్తుగా పరిణమించింది. భారత్ ఆర్థికంగా దూసుకుపోతున్నప్పటికీ, మన దేశ భవిష్యత్తును కబళించేస్తున్న ఒక నిశ్శబ్ద శత్రువుగా వాయు కాలుష్యం మారింది. ముఖ్యంగా పట్టణాలు, నగరాలు గ్యాస్ చాంబర్లుగా మారుతున్నాయి. ఈ సమస్యను పర్యావరణ అంశంగానే కాకుండా, జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా పరిగణించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం, ప్రపంచంలోని అత్యంత కలుషితమైన నగరాల్లో అత్యధిక సంఖ్యలో భారతీయ నగరాలే ఉన్నాయి. ఈ కాలుష్యానికి ప్రధాన కారణం గాలిలో ఉండే సూక్ష్మ కణాలు. వీటి గాఢత సురక్షిత స్థాయిలను మించిపోవడం వలన మన ఊపిరితిత్తులు విషాన్ని పీల్చుకోవాల్సి వస్తోంది.



వాహనాల నుంచి వచ్చే పొగ, పరిశ్రమల ఉద్గారాలు, ఉత్తర భారతదేశంలో పంట వ్యర్థాలను తగలబెట్టడం, నిర్మాణ వ్యర్థాలు వంటివి తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. కాలుష్యం వల్ల సంభవించే ఆరోగ్య సమస్యలు కోట్లాది మంది భారతీయుల జీవితాలను నాశనం చేస్తున్నాయి. దీర్ఘకాలికంగా వచ్చే ఉబ్బసం, బ్రోంకైటిస్, క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటివి ఆవహిస్తున్నాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. శిశు మరణాల రేటు పెరగడానికి, పిల్లల్లో జ్ఞాపకశక్తి తగ్గడానికి కాలుష్యం ఒక కారణమవుతోంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి ప్రకటనలు సరిపోవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సమగ్రమైన, కఠినమైన చర్యలు తీసుకోవాలి. ప్రజా రవాణా వ్యవస్థలను బలోపేతం చేయడం, ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహం ఇవ్వడం, పాత, కాలుష్యం కలిగించే వాహనాలను రోడ్లపై నుంచి తొలగించడం వంటివి చేయాలి. కాలుష్య నియంత్రణ ప్రమాణాలను కఠినంగా అమలు చేయడం, పారిశ్రామిక యూనిట్లు తప్పనిసరిగా ఆధునిక ఉద్గార నియంత్రణ సాంకేతికతలను ఉపయోగించేలా చూడటం వంటి చర్యలు చేపట్టాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యక్తిగత వాహన వినియోగానికి బదులు సైకిల్ లేదా నడకను ఎంచుకోవడం వంటి పనులు ప్రతి పౌరుడు చేసేలా ప్రోత్సహించాలి. కాలుష్య స్థాయిలను ఎప్పటికప్పుడు ప్రజలకు పారదర్శకంగా తెలియజేయడం, తద్వారా వారు తగిన జాగ్రత్తలు తీసుకోగలుగుతారు. వాయు కాలుష్యం ఒకరిద్దరి సమస్య కాదు. ఇది మనందరి ఉమ్మడి శ్వాస వ్యవస్థకు సంబంధించిన సమస్య. ఈ ముప్పును ఎదుర్కోవడానికి మనం ఏకమవ్వాలి. రేపటి తరం శుభ్రమైన గాలిని పీల్చుకోవాలంటే, నేడు మనం కాలుష్యాన్ని నిర్మూలించే యుద్ధంలో భాగస్వాములు కావాలి. లేకపోతే, ఈ కాలుష్యం భారత దేశ అభివృద్ధి కథనానికి విషాదకరమైన ముగింపు పలకడం ఖాయం.



**గంగాధర్**

# కోరేది శాశ్వత పరిష్కారమే




స్థానిక సంస్థల ఎన్నికలు అనేవి ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలు. గ్రామాలు, పట్టణాల వాస్తవ సమస్యలను, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే ఈ ప్రక్రియ... పాలనా వికేంద్రీకరణకు పునాది. అయితే, తెలంగాణలో గత కొద్ది నెలలుగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ చుట్టూ అలుముకున్న న్యాయపరమైన, రాజకీయపరమైన అనిశ్చితి స్థానిక సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉంది. తెలంగాణ ప్రభుత్వం బీసీ (వెనుకబడిన తరగతులకు) లకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం ఆ వర్గంలో హర్షం వ్యక్తమైనప్పటికీ, న్యాయస్థానంలో అది గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

సుప్రీంకోర్టు స్పష్టంగా నిర్దేశించిన 50% రిజర్వేషన్ల పరిమితి నిబంధనను హైకోర్టు గుర్తు చేయడం, ఆ జీవోపై స్టే విధించడం జరిగిపోయాయి. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఉపశమనం లభించలేదు. బీసీల రాజకీయ సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉండడం స్వాగతించదగినదే. అయితే, న్యాయపరమైన లోపాలు లేని సమగ్ర డేటా ఆధారంగా రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం, రాజకీయ ఆకాంక్షలకు చట్టపరమైన ప్రాధాన్యాన్ని సక్రమంగా ఇవ్వకపోవడమే ఈ జాప్యానికి ప్రధాన కారణం. ప్రభుత్వం ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని హడావుడిగా నిర్ణయం తీసుకోవడం వెనుక ఉన్న ఏకైక బలమైన కారణం నిధుల కోల్పోయే ప్రమాదం. 15వ ఆర్థిక సంఘం నిబంధనల ప్రకారం, నిర్ణీత కాలంలో ఎన్నికలు పూర్తి కాకపోతే, గ్రామాలకు దక్కాల్సిన వేల కోట్ల నిధులు నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ నిధులు గ్రామీణాభివృద్ధికి ప్రాణం పోసేవి. న్యాయ చిక్కులున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలను వాయిదా వేసి, కేవలం గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించడం, 'నిధులు' అనే అంశం పాలనాపరమైన 'ఆవశ్యకత'గా ప్రభుత్వానికి కనిపించడాన్ని సూచిస్తుంది. అయితే, ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల పరంగా.. న్యాయస్థానం ఆదేశాలను గౌరవిస్తూనే, బీసీ రిజర్వేషన్ల అంశాన్ని శాశ్వతంగా, చట్టబద్ధంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత వేగంగా చర్యలు తీసుకోవాలి. బీసీ కమిషన్ ద్వారా పకడ్బందీగా, న్యాయస్థానం ఆమోదించే విధంగా సామాజిక–ఆర్థిక డేటాను సిద్ధం చేయాలి. సుప్రీంకోర్టు తీర్పుల పరిధిలో ఉంటూనే, రాష్ట్రంలోని బీసీల వెనుకబాటుతనాన్ని నిరూపించడానికి తగిన న్యాయపరమైన వ్యూహాన్ని రూపొందించాలి. స్థానిక సంస్థలు కేవలం నిధుల వినియోగ వేదికలు కావుబీ అవి ప్రజాస్వామ్య మనుగడకు అత్యవసరం. నిధుల కోసం ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా, అన్ని వర్గాలకు న్యాయమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం కూడా అంతే ముఖ్యం.

**- సత్యదేవ్ తడిగొండ, బీసీ నాయకుడు**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.